www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
08 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 243

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## ఈనెల 12 వరకు అసెంబ్లీ సమావేశాలు

- బీఏసీ కీలక నిర్ణయం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ
- 22ఏపై జ్యుడీషియల్ విచారణ డిమాండ్
- 25 అంశాలపై బీజేపీ పట్టు
- పొడిగింపుపై మరోసారి బీఏసీ భేటీ

02



## స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు

- స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలు
- రేవంత్ తీవ్ర ఆగ్రహం
- కేసీఆర్ క్షమాపణకు డిమాండ్
- తాతా మధు రాజీనామాకు అల్టిమేటం
- దళిత అంశంపై రేవంత్ ఫైర్
- అసెంబ్లీలో రాజకీయ వేడి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వేళ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ప్రతిష్ఠను అవమానించినట్టేనని ఆయన అన్నారు. తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, తాతా మధుతో రాజీనామా చేయించాలని సీఎం స్పష్టం చేశారు. సభ్యత్వం రద్దు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. సభలో ఇలాంటి వ్యాఖ్యలకు చోటు ఉండకూడదని, ప్రజాస్వామ్య సంస్థలపై గౌరవం ప్రతి ప్రజాప్రతినిధికి తప్పనిసరిగా ఉండాలని రేవంత్ పేర్కొన్నారు.

మిగతా 3లో..

## తెలంగాణ ఓటర్లకు బిగ్ రిలీఫ్

- ఎస్ఐఆర్ గడువు పొడిగింపు
- అక్టోబర్ 7 వరకు అవకాశం
- సెప్టెంబర్ 16 పాత గడువు
- క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు ఛాన్స్
- ఓటర్లకు అదనపు సమయం
- అధికారులపై కీలక బాధ్యత




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కీలక మార్పు చోటుచేసుకుంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించేందుకు గడువును ఎన్నికల సంఘం అక్టోబర్ 7 వరకు పొడిగించింది. గత షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. దీంతో ఓటర్లకు తమ పేర్లు జాబితాలో ఉన్నాయా, వివరాలు సరిగ్గా నమోదయ్యాయా అనే అంశాలను మరోసారి

మిగతా 3లో..







# తొలిరోజే రచ్చ!

## అసెంబ్లీ తొలిరోజే బీఆర్ఎస్- కాంగ్రెస్ హైడ్రామా

- నల్ల టీషర్టులని రసనతో గేటు వద్ద ఉద్రిక్తత
- కేటీఆర్ అరెస్ట్, నిరసనగా టీషర్ట్ విప్పిన హరీశ్ రావు
- పోలీసుల తీరుపై కన్నీరు పెట్టుకున్న సునీతా లక్ష్మారెడ్డి
- తోపులాటలో జగదీశ్ రెడ్డి కాలికి గాయం
- ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తామన్న బీఆర్ఎస్



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే రాజకీయ వేడి రాజుకుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మొదలవ్వడంతో అసెంబ్లీ చుట్టూ టెన్షన్ వాతావరణం కనిపించింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు వేసుకుని అసెంబ్లీకి వచ్చారు. కొన్ని టీషర్టులపై నినాదాలు ఉండటంతో పోలీసులు వాటిని ప్రాంగణంలోకి అనుమతించేందుకు అభ్యంతరం చెప్పారు. దీంతో బీఆర్ఎస్ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మాటల గొడవ తోపులాటగా మారింది. అసెంబ్లీ ప్రధాన గేటు దగ్గర పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పోలీసులు పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడంతో బీఆర్ఎస్ శిబిరంలో ఆగ్రహం పెరిగింది. సమావేశాలు మొదలయ్యే ముందే ఇలా జరగడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పోలీసులు భద్రతా నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు చెప్పాయి. ఈ ఘటనతో మొదటి రోజు అసెంబ్లీ బయటే హాట్ టాపిక్ మొదలైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో మరో హైడ్రామా కనిపించింది. కేటీఆర్‌ను ఎత్తుకుని పోలీసు వాహనంలోకి ఎక్కించే ప్రయత్నం జరుగుతుండగా అక్కడ ఉద్రిక్తత మరింత పెరిగింది. తనను పోలీసులు దురుసుగా హ్యాండిల్ చేశారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసుల వ్యవహారశైలిపై మండిపడుతూ రేవంత్ రెడ్డికి ఇంతకు ఇంతా చెల్లిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తకుండా అడ్డుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కేటీఆర్‌ను అదుపులోకి తీసుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ చర్చ మరింత వేడెక్కింది. బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించాయి. మరోవైపు కాంగ్రెస్ వర్గాలు మాత్రం

మిగతా 2లో..

## రేవంత్-కేసీఆర్ కొత్త గేమ్!

- రేవంత్ వర్సెస్ కేసీఆర్ పోరు కొత్త మలుపు
- కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించడమే రేవంత్ టార్గెట్
- గజ్వేల్ ఉప ఎన్నికకు కేసీఆర్‌కు సవాల్
- కేసీఆర్ ఫోకస్ ఇప్పుడు ప్రజాక్షేత్రంపై
- సాగునీటిని ప్రధాన ఉద్యమ అంశంగా ఎంచుకున్న బీఆర్ఎస్
- 'అసెంబ్లీ వర్సెస్ స్ట్రీట్'గా మారుతున్న తెలంగాణ రాజకీయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త సీన్ కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఒక వైపు కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని గట్టిగా కోరుతున్నారు. రావడం ఇష్టం లేకపోతే గజ్వేల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు వెళ్లాలని సవాల్ చేస్తున్నారు. సాధారణంగా ఇలాంటి సవాల్ వస్తే ప్రతిపక్ష నేత వెంటనే సభలోకి వచ్చి సమాధానం చెప్పాలి. కానీ కేసీఆర్ మాత్రం ఆ దారిలో నడిచేలా కనిపించడం లేదు. ఆయన అసెంబ్లీకి దూరంగా ఉంటూ ప్రజల్లోకి వెళ్లే ప్లాన్‌పై ఫోకస్ పెట్టారు. దీంతో తెలంగాణలో అసలు ఫైట్ ఎక్కడ జరుగుతుంది అనే ప్రశ్న ఆసక్తి పెంచుతోంది. ఒకవైపు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ఎదుర్కోవాలని రేవంత్ కోరుకుంటుంటే, మరోవైపు వీధుల్లోకి వెళ్లి

మిగతా 3లో..



## మహిళా ఎమ్మెల్యేలపై దాడి దుర్మార్గం

- ఫీజు బకాయిలపై కవిత ఫైర్
- వరంగల్‌లో విద్యార్థుల నిరసన
- కాలేజీల మూతపై ఆందోళన
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఖండన
- పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

02

## తాతా మధుపై కఠిన చర్యలు?

- తాతా మధు వ్యాఖ్యలపై వివాదం
- సభా హక్కుల ఉల్లంఘన చర్చ
- కఠిన చర్యలకు కాంగ్రెస్ సిద్ధం
- ప్రివిలేజ్ కమిటీకి పంపే యోచన
- అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నిరసన
- తెలంగాణ రాజకీయాల్లో ముదిరిన వేడి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజకీయ వేడి రాజుకుంది. అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్లచొక్కాలతో నిరసన చేపట్టగా, భద్రతా సిబ్బందితో తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త వివాదానికి కేంద్రంగా మారాయి. సభాపతి పీఠం, పోలీసు వ్యవస్థను ఉద్దేశించి ఆయన మాట్లాడిన తీరు సభా హక్కుల ఉల్లంఘన పరిధిలోకి వస్తుందా అనే చర్చ మొదలైంది. మీడియా కెమెరాల ముందు చేసిన వ్యాఖ్యలు

మిగతా 3లో..

## సింగరేణిలో మారుపేర్ల సమస్య

- పరిష్కారానికి మానవీయ కోణంలో ప్రభుత్వం పరిశీలిస్తుంది
- శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**విశాలభారతి, తెలంగాణ బ్యూరో:**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల' సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ శాసనమండలిలో స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ ఇచ్చే

మిగతా 4లో..

## భూగర్భ జలాలకు గండం

- ఆగస్టు నాటికి భూగర్భ జలాల సగటు లోతు 7.87 మీటర్లు
- 15 శాతం వర్షపాతం తగ్గడంతో జలాలు అడుగంటాయి
- మేడ్చల్, హైదరాబాద్‌తో పాటు చాలా జిల్లాల్లో నీటి మట్టాలు పడిపోయాయి
- 28శాతం ప్రాంతంలో మాత్రమే సురక్షిత నీరు ఉంది

02



# ఈనెల 12 వరకు అసెంబ్లీ సమావేశాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వ్యవహారంపై కీలక నిర్ణయం వెలువడింది. శాసనసభ వ్యవహారాల సంఘం బీఏసీ భేటీలో ప్రస్తుత సమావేశాలను వారం రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభా కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని సభలో చర్చించేందుకు బీఏసీ ఆమోదం తెలిపింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, బకాయిల చెల్లింపులపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఉంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు ఇప్పటికే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. తాజా నిర్ణయంతో అసెంబ్లీ వేదికగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశం మరోసారి ప్రధాన రాజకీయ చర్చగా మారనుంది. సభలో చర్చకు వచ్చే అంశాలపై పార్టీల మధ్య ఆసక్తి పెరిగింది. సభలో అధికార సభ్యులు కూడా తమ శాఖల పనితీరును వివరించనున్నారు. ముఖ్యంగా విద్యా రంగానికి సంబంధించిన నిర్ణయాలు, నిధుల విడుదల, విద్యార్థుల ప్రయోజనాలపై చర్చకు ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది. బీఏసీ నిర్ణయం ప్రకారం సమావేశాలు వారం రోజులపాటు కొనసాగనున్నాయి. అయితే సభా కార్యక్రమాల కోసం కేటాయించిన సమయం సరిపోదని ప్రతిపక్ష సభ్యులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. వివిధ శాఖలకు సంబంధించిన కీలక అంశాలు చర్చకు రావాల్సి ఉన్న నేపథ్యంలో సమావేశాలను మరింత పొడిగించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీనిపై మరోసారి బీఏసీ సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుంది. సభలో ప్రజా సమస్యలకు తగిన సమయం ఇవ్వాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ప్రభుత్వం తన విధానాలను వివరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, చర్చకు తీసుకునే అంశాల సంఖ్యపై స్పష్టత అవసరమవుతోంది. దీంతో తదుపరి బీఏసీ భేటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సమావేశాల పొడిగింపుపై నిర్ణయం తీసుకున్న తర్వాత సభా ఎజెండాలో మరిన్ని అంశాలు చేరే అవకాశం కనిపిస్తోంది. అదే సమయంలో ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని భావిస్తున్నారు. సాగునీరు, రహదారులు, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రశ్నలు రావచ్చు. ఇదిలా ఉంటే, భారతీయ జనతా పార్టీ పలు కీలక డిమాండ్లను బీఏసీ దృష్టికి తీసుకెళ్లింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమగ్ర చర్చ జరపాలని కోరిన బీజేపీ, 22ఏ అంశంపై న్యాయపరమైన విచారణ జరపాలని పట్టుబట్టింది. ఈ రెండు అంశాలు సభలో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. 22ఏ వ్యవహారంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని బీజేపీ కోరుతోంది. దీంతో ఈ అంశంపై అధికార పక్షం స్పందన ఎలా ఉంటుందనే ఆసక్తి ఏర్పడింది. రాష్ట్రానికి సంబంధించిన మరో 25 అంశాలను కూడా అసెంబ్లీలో చర్చించాలని బీజేపీ ప్రతిపాదించింది. ప్రజలకు సంబంధించిన సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ కోరుతున్న నేపథ్యంలో సభలో వాడివేడి చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాల ప్రాధాన్యతలు సభా కార్యక్రమాలపై ప్రభావం చూపనున్నాయి. సభలో చర్చకు వచ్చే అంశాలపై ఇప్పటికే పార్టీల్లో వ్యూహాలు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తుండగా, ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు అధికార పక్షం సిద్ధమవుతోంది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా కూడా కీలకంగా మారాయి. అధికార కాంగ్రెస్‌పై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్న వేళ, సభలో ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభలోకి అనుమతించే అంశంపై తెలంగాణ హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవద్దని పోలీసు అధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో నల్ల దుస్తులతో నిరసనకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు అధికార, ప్రతిపక్షాల మధ్య సమన్వయం అవసరమవుతోంది. రాజకీయ ఆరోపణలకు మించి ప్రజా సమస్యలపై చర్చ జరగాలని పలువురు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో స్పీకర్ సభా నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. సభ్యులకు తగిన సమయం కేటాయించి, ముఖ్యమైన అంశాలపై నిర్మాణాత్మక చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వారం రోజుల సమావేశాల్లో ఏ అంశాలు ముందుగా చర్చకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ వ్యవహారం, ఇతర ప్రజా సమస్యలపై సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది. బీఏసీ మరోసారి సమావేశమై సమయాన్ని పెంచాలా, వద్దా అన్న అంశంపై నిర్ణయం తీసుకోనుంది. సభా సమయాన్ని సమర్థంగా వినియోగించి ఎక్కువ అంశాలపై చర్చకు అవకాశం కల్పించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ప్రభుత్వం కూడా ప్రజా సమస్యలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో రాబోయే రోజుల్లో అసెంబ్లీ సమావేశాలు రాజకీయ వేడిని పెంచే అవకాశాలు ఉన్నాయి. బీఏసీ తుది నిర్ణయం తర్వాత పూర్తి ఎజెండాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రజల సమస్యలు, ప్రభుత్వ విధానాలు, ప్రతిపక్షాల డిమాండ్లు కేంద్రంగా సభా చర్చలు సాగనున్నాయి. మొత్తం మీద వారం రోజుల అసెంబ్లీ సమావేశాలు తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలకు వేదిక కానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి రోజు సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ప్రజా సమస్యలపై ఫలవంతమైన చర్చ జరగాలన్నదే ప్రధాన అంచనాగా ఉంది.

## కాంగ్రెస్ హామీలు 'నీటిమూటలే'

- సైబరాబాద్ కమిషనర్‌కు బీఆర్ఎస్ వినతి
- ప్రజా సమస్యలు తీర్చకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరిక



సైబరాబాద్ విశాల భారతి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.శ్రీజనకు కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీలన్నీ ఓట్ల కోసమేనని, అధికారంలోకి వచ్చాక రోడ్ల మరమ్మతులు, వీధిదీపాలు, తాగునీరు, డ్రైనేజీ వంటి కనీస వసతులను కూడా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గుంతలమయమైన రహదారులకు వెంటనే బీటీ, సీసీ పనులు చేపట్టి, వర్షాకాలం దృష్ట్యా మురుగునీటి వ్యవస్థను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే బాధితులతో కలిపి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ వినతిపై స్పందించిన కమిషనర్ శ్రీజన, త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, నవతారెడ్డి, మాధవరం రంగారావు, నాయకులు సంగారెడ్డి, రవి యాదవ్, రోజా రమణి, తదితరులు పాల్గొన్నారు.



**వరంగల్ నూతన కూడా చైర్మన్ గా పదవిబాధ్యతలు స్వీకరించిన శ్రీమతి గుండు సుధారాణి వరంగల్ కాశీబుగ్గ 19 వ డివిజన్ కి చెందిన అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కుందారపు గోపి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వరంగల్ సమగ్ర అభివృద్ధి కి తన వంతు గా కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది.**

*- విశాల భారతి వరంగల్*





# తొలిరోజే రచ్చ!

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీ భద్రతకు ఆటంకం కలిగించే చర్యలను సహించబోమని చెప్పాయి. ఈ వ్యవహారం కేవలం గేటు దగ్గర గొడవగా కాకుండా రెండు పార్టీల మధ్య పెద్ద రాజకీయ అంశంగా మారింది. సమావేశాల్లో ఇదే అంశాన్ని బీఆర్ఎస్ మరింత బలంగా ప్రస్తావించే అవకాశం కనిపిస్తోంది. దీంతో రాజకీయ ఉద్రిక్తత కొనసాగే సూచనలు ఉన్నాయి. ఇదే సమయంలో మాజీ మంత్రి హరీశ్ రావు కూడా పోలీసుల తీరుకు నిరసనగా తన టీషర్ట్ విప్పేశారు. బీఆర్ఎస్ నేతల సమాచారం ప్రకారం కేపీ వివేక్, సుధీర్ రెడ్డి కూడా టీషర్టులు తొలగించారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో తన చీరను పోలీసులు లాగారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ప్రజాప్రతినిధితో ఇలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన తర్వాత ఆమె తీవ్ర భావోద్వేగానికి గురికాగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆమెను ఓదార్చారు. మహిళా ఎమ్మెల్యే పట్ల పోలీసుల ప్రవర్తనపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసుల నుంచి పూర్తి వివరణ రావాల్సి ఉంది. ఇదే సమయంలో పోలీసులతో జరిగినపులాటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కాలికి గాయమైనట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. దీంతో అసెంబ్లీ బయట ఉద్రిక్తత కొనసాగింది. అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు, పెండింగ్ హామీలపై అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగాలు, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. తమకు మాట్లాడేందుకు సరైన సమయం ఇవ్వాలని వారు కోరుతున్నారు. సమావేశాలు తక్కువ రోజులు మాత్రమే జరిగితే కీలక అంశాలు పూర్తిగా చర్చకు రావని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మాత్రం అవసరమైన సమయం మేరకే సభ నిర్వహణ ఉంటుందని చెప్పే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సభా కార్యక్రమాలపై అధికార ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం తప్పదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మొదటి రోజే బయట కనిపించిన ఉద్రిక్తత సభ లోపల కూడా ప్రభావం చూపే అవకాశముంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యూహాత్మకంగా అంశాలను సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కీలక అంశాలపై గట్టిగా స్పందించేందుకు సిద్ధంగా ఉంది. మొత్తంగా చూస్తే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలి రోజు నుంచే అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోరు కొత్త మలుపు తీసుకుంది. అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన నిరసన, పోలీసుల చర్యలు, నేతల అదుపు ఘటనలు రాజకీయ వేడిని పెంచాయి. కేటీఆర్, హరీశ్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, జగదీశ్ రెడ్డి ఘటనలు బీఆర్ఎస్‌కు ప్రభుత్వాన్ని టార్గెట్ చేసే అవకాశం ఇచ్చాయి. మరోవైపు కాంగ్రెస్ ఈ పరిణామాలను సభా భద్రత, నిబంధనల కోణంలో వివరించే అవకాశం ఉంది. ఇక అసెంబ్లీ లోపల హామీలు, పాలన, అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చలు ప్రధానంగా సాగనున్నాయి. ప్రతిపక్షం దూకుడు పెంచితే అధికార పక్షం కూడా గట్టిగానే కౌంటర్ ఇచ్చే పరిస్థితి ఉంది. మొదటి రోజే ఏర్పడిన ఈ వాతావరణం రాబోయే సమావేశాల్లో మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా కాలంలో ప్రతి మాట, ప్రతి దృశ్యం వెంటనే ప్రజల్లోకి వెళ్తోంది. నేతల ప్రకటనలు, సభా వ్యూహాలు మరింత కీలకంగా మారాయి. ప్రజలకు కావాల్సింది గొడవలు కాదు, సమస్యలపై పరిష్కారాలు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడి దుర్మార్గం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం మరోసారి రాజకీయ వేడి రాజేసింది. గత మూడేళ్లుగా బకాయిలు విడుదల కాక విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కల్వకుంట్ల ఆరోపించారు. వరంగల్‌లో విద్యార్థి సంఘాలతో కలిసి చేపట్టిన నిరసన సందర్భంగా ఆమె ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల చదువులకు అడ్డంకులు లేకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. రీయింబర్స్‌మెంట్ ఆలస్యంతో కళాశాలల నిర్వహణ కూడా భారంగా మారిందని వివరించారు. ఫీజుల కోసం విద్యార్థుల కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ర్యాలీ సందర్భంగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరేట్ వద్ద వినతిపత్రం సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక చిన్న ప్రైవేట్ కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని కవిత పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఇతర విద్యార్థి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందక పేద కుటుంబాల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. చదువుల కోసం ఆధారపడే కుటుంబాలపై బకాయిల ప్రభావం తీవ్రంగా ఉంటోందని తెలిపారు. వరంగల్ నిరసనలో చిన్నారులు సైతం పాల్గొని ఎండను లెక్కచేయకుండా నడిచారని చెప్పారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న భావన బలపడుతోందని అన్నారు. బకాయిల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కళాశాలలకు చెల్లింపులు సకాలంలో జరిగితే విద్యార్థులకు ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా రంగంపై ఏర్పడిన ఒత్తిడిని తొలగించాలని కోరారు. బకాయిలు పేరుకుపోవడంతో నిర్వహణ ఖర్చులు భరించడం కష్టమవుతోందని కళాశాలల వర్గాలు చెబుతున్నాయి. విద్యార్థుల చదువులు మధ్యలో ఆగకుండా నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. అత్యవసర అంశంగా మారింది. విద్యార్థుల తరఫున వచ్చిన వినతిని అధికారులు స్వీకరించారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును కవిత తీవ్రంగా ఖండించారు. సీనియర్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను పోలీసులు నెట్టివేయడం, అవమానకరంగా వ్యవహరించడం దారుణమని ఆమె పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలని ప్రశ్నించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ మహిళల గౌరవం విషయంలో రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య నిరసనలను గౌరవించే సంస్కృతి కొనసాగాలని ఆమె కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులతో పోలీసులు సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని సూచించారు. మహిళా సంఘాలు స్పందించాలని ఆమె సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు అవసరమని ఆమె పేర్కొన్నారు. కొత్త డీజీపీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళలపై దాడులు, హింస పెరిగాయని కవిత ఆరోపించారు. చట్టసభలకు ప్రాతినిధ్యం వహించే మహిళా సభ్యుల పట్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమన్నారు. రాజకీయాల్లో కనీస ఔచిత్యం, గౌరవం పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ఘటనపై సమగ్రంగా పరిశీలించి బాధ్యులను గుర్తించాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేలకు తమ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని కవిత తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడటం అందరి బాధ్యతగా ఆమె అభిప్రాయపడ్డారు. అధికార యంత్రాంగం నిరసనల సమయంలో సంయమనం పాటించాలని సూచించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. బాధ్యత కలిగిన అధికారులు స్పందించి ప్రజలకు నమ్మకం కలిగించాలని ఆమె కోరారు. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చట్ట ప్రకారం చర్యలు సాగాలని ఆమె కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు అవకాశం లేకుండా మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. తక్షణ స్పందన అవసరమని తెలిపారు. ఫీజు బకాయిలు, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల ప్రవర్తన రెండు అంశాలపై కవిత ప్రభుత్వం తీరును ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కళాశాలలు కొనసాగేందుకు అవసరమైన చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మరోవైపు మహిళా ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ విద్యార్థుల ఆందోళనతో పాటు అసెంబ్లీ ఘటన రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ స్పందనపై ఇప్పుడు విద్యార్థులు, రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. బకాయిల విడుదలకు తేదీ ప్రకటించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. పోలీసుల తీరుపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని రాజకీయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ రెండు అంశాలపై చర్యలు కీలకంగా మారాయి. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థుల ఆందోళనకు పరిష్కారం చూపితే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# భూగర్భ జలాలకు గండం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో భూగర్భ జలాలు ప్రస్తుతం ఆందోళనకరంగా పడిపోతున్నాయి. వర్షాకాలంలోనే నీటి మట్టాలు లోతుకు వెళ్లడం తీవ్ర కలవరపెడుతోంది. రాష్ట్ర భూగర్భ జలశాఖ ఆగస్టు నివేదిక ప్రకారం సగటు లోతు 7.87 మీటర్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయానికి 5.78 మీటర్లు మాత్రమే ఉంది. ఏడాది కాలంలోనే భూగర్భ జలాలు సగటున 20.9 మీటర్లు క్షీణించాయి. జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు చివరి వరకు 574 మిల్లీమీటర్ల వర్షపాతం పడాలి. అయితే ఈసారి 474 మిల్లీమీటర్లే నమోదైంది. 15 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. 15 జిల్లాల్లో 21 నుంచి 45 శాతం వరకు తీవ్ర లోటు కనిపిస్తోంది. దీని తీవ్ర ప్రభావం భూగర్భ జలాలపైన స్పష్టంగా పడుతోంది. ఈ పరిస్థితి రాబోయే కాలంలో మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని 30 జిల్లాలలోనూ భూగర్భ జల మట్టాలు చాలా ఆందోళనకరంగా పడిపోయాయి. అత్యధికంగా హైదరాబాద్‌లో 5.76 మీటర్లు పతనం అయింది. సూర్యాపేటలో 5.35 మీటర్లు వికారాబాద్‌లో 5.1 ఆరు మీటర్ల చొప్పున లోతుకు వెళ్లాయి. ఆదిలాబాద్‌లో 3.48 మీటర్ల లోతులోనే నీరు అందుబాటులో ఉంది. అయితే మేడ్చల్ మల్కాజిగిరిలో మాత్రం 12.12 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. కేవలం రెండు జిల్లాలలో మాత్రమే పరిస్థితి కొంత మెరుగ్గా కనిపిస్తోంది. మెదక్ జిల్లాలో 0.92 మీటర్లు మంచిర్యాలలో సున్నా పాయింట్ ఒకటి మీటర్లు నీటి మట్టం పెరిగింది. మిగతా ప్రాంతాలన్నింటిలోనూ పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ప్రజలు తాగుసాగు నీటి కోసం భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రభుత్వం తక్షణ రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం చాలా ఉంది. భూగర్భ జలాల లోతుల ఆధారంగా పరిశీలిస్తే రాష్ట్ర విస్తీర్ణంలో కేవలం 28 శాతం ప్రాంతంలో మాత్రమే 5 మీటర్ల లోపు నీరు ఉంది. వీటిని మాత్రమే సురక్షిత స్థితిగా నిపుణులు పరిగణిస్తారు. 46 శాతం భూభాగంలో 5 నుంచి 10 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. మరో 20 శాతం ప్రాంతంలో 10 నుంచి 15 మీటర్ల లోతులో జలాలు లభిస్తున్నాయి. ఇది కాకుండా మరో 5 శాతం భూభాగంలో భూగర్భ జలాలు ఏకంగా 20 మీటర్లకు పైగా లోతులోకి వెళ్లిపోయాయి. ఈ గణాంకాలు చూస్తుంటే రాబోయే కాలంలో రాష్ట్రాన్ని ఎంతటి ముప్పు ముంచుకురానుందో స్పష్టంగా అర్థమవుతోంది. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతుండటం వల్ల వ్యవసాయ రంగానికి కూడా భారీ నష్టం వాటిల్లే అవకాశం పూర్తిగా ఉంది. ప్రతి ఒక్కరూ తాగునీటిని పొదుపుగా వాడుకుంటూ విలువైన ప్రతి చుక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఎంతైనా ఉంది సకాలంలో స్పందించకపోతే ముప్పు తప్పదు అని హెచ్చరిస్తున్నారు. గత దశాబ్దపు సగటుతో పోలిస్తే కూడా ఇప్పుడు పరిస్థితి చాలా దారుణంగా తయారైంది. 2016 నుంచి 2025 వరకు ఆగస్టు నెలలో సగటు లోతు 7.59 మీటర్లుగా ఉండేది. కానీ ఇప్పుడు అది 7.87 మీటర్లకు పెరిగిపోయింది. రాష్ట్రంలోని 621 మండలాలలో 557శాతం మండలాల్లో నీటి మట్టాలు తగ్గిపోయాయి. సుమారు 355 మండలాల్లో దశాబ్దపు సగటు కంటే తక్కువ జలాలు నమోదయ్యాయి. అందులోనూ 128 మండలాల్లో ఏకంగా 2 మీటర్లకు పైగా పతనం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాలలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. వర్షాలు కాస్త కురిసినప్పటికీ భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే భారీగా పడిపోయాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయకపోతే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు అని అందరూ హెచ్చరిస్తున్నారు ఎల్లప్పుడూ అప్రమత్తత అవసరం. వర్షాలు కురుస్తున్న కాలంలోనే భూగర్భ జలాలు ఇంత భారీగా పడిపోతే రాబోయే ఎండాకాలంలో పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో మనం ఊహించవచ్చు. నీటి పొదుపు చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టకపోతే భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తీవ్రంగా తలెత్తుతుంది. సాగునీటి రంగం కూడా తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం పూర్తిగా ఉంది. వర్షపు నీటిని ఒడిసిపట్టే రీఛార్జ్ పద్ధతులను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలి. ప్రతి ఇంట్లోనూ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో చైతన్యం తేవాలి. బోర్వెల్లపై ఆధారపడటాన్ని తగ్గించి చెరువులను బాగుచేసి కాపాడుకోవాలి. ప్రభుత్వాలు కూడా నీటి సంరక్షణ ఉద్యమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి. పాతాళానికి వేగంగా చేరుతున్న జలాలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదలాలి. వర్షపు ప్రతి చుక్కను వృథా చేయకుండా ఒడిసిపడితేనే మన మనుగడ సాధ్యమవుతుంది. లేదంటే రాబోయే తరాలకు తీవ్రమైన ముప్పు వస్తుంది కాబట్టి ఇప్పటికైనా మేలుకోవడం చాలా అవసరం లేదంటే భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ముంది జాగ్రత్త పడాలి అందరూ కలిసికట్టుగా పోరాడాలి నీటి సంరక్షణ కోసం.

## లండన్ నుంచి రాగానే యూట్యూబర్ నందన అరెస్టు

- లుక్‌ఔట్ నోటీసులతో శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి
- ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగింత

సైబరాబాద్ - విశాల భారతి

లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్ విమానాశ్రయంలో ఆర్జీఐఏ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లండన్ నుంచి విమానాశ్రయానికి చేరుకున్న ఆమెను ఇమిగ్రేషన్ అధికారులు గుర్తించారు. నందనపై గతంలోనే లుక్‌ఔట్ నోటీసులు జారీ కావడంతో విషయాన్ని ఆర్జీఐఏ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆమెను విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకున్నారు.అనంతరం నందనను తదుపరి విచారణ నిమిత్తం ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. నందన దంపతులు లండన్‌లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై గతంలో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే పోలీసులు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.



# తాతా మధుపై కఠిన చర్యలు?

మొదటిపేజీ తరువాయి

కావడంతో వివాదం మరింత ముదిరింది. ప్రతిపక్ష నిరసనకు హక్కు ఉన్నప్పటికీ రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని అధికార కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని ఆధారంగా చేసుకుని బీఆర్ఎస్‌పై రాజకీయ ఒత్తిడి పెంచేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అసెంబ్లీ వెలుపల మొదలైన వివాదం ఇప్పుడు సభా వ్యవహారాల్లోకి చేరింది. రాజకీయంగా ఈ అంశం కాంగ్రెస్‌కు ప్రతిపక్షంపై నేరుగా దాడి చేసే అవకాశం కల్పించింది. తాతా మధు వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా పరిగణిస్తోంది. సభాపతి పీఠాన్ని అవమానించేలా మాట్లాడటం సాధారణ రాజకీయ విమర్శ కాదని అధికార పార్టీ నేతలు అంటున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలపై నిరసన చేయవచ్చు, ప్రశ్నించవచ్చు, విమర్శించవచ్చు. అయితే సభను నడిపించే స్పీకర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వేరే అంశమని కాంగ్రెస్ వాదిస్తోంది. తాతా మధు అనుభవం ఉన్న ప్రజాప్రతినిధి కావడంతో ఆయన మాటలకు మరింత బాధ్యత ఉండాల్సిందని అధికార పక్షం చెబుతోంది. ప్రత్యక్ష ప్రసారాలు, మీడియా కథనాల ద్వారా వ్యాఖ్యలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాయి. దీంతో ఈ వ్యవహారాన్ని తేలిగ్గా వదిలేయకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. సభా గౌరవాన్ని కాపాడే అంశంగా దీనిని ప్రజల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం. రాజకీయంగా కూడా ఈ వివాదాన్ని బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి ఉపయోగించేందుకు వ్యూహం సిద్ధమవుతోంది. అధికార పార్టీ దీనిని సభా ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా చిత్రీకరిస్తోంది. ఇది సభా చర్చలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ వ్యవహారంపై స్పందించినట్లు సమాచారం. సభా గౌరవాన్ని తగ్గించే వ్యాఖ్యలపై కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయం అధికార పార్టీలో వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి తదుపరి



చర్యలపై నిర్ణయం తీసుకునే దిశగా కదులుతున్నట్లు తెలుస్తోంది. తాతా మధుపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వాలా, లేక ప్రివిలేజ్ కమిటీకి వ్యవహారాన్ని అప్పగించాలా అనే అంశంపై పరిశీలన సాగుతోంది. మండలి సభ్యుడైన ఆయనపై అక్కడి నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం కూడా చర్చకు వస్తోంది. అయితే తుది నిర్ణయం సంబంధిత సభా వ్యవస్థల నిబంధనలు, అందుబాటులో ఉన్న ఆధారాల పరిశీలన తర్వాతే వెలువడే అవకాశం ఉంది. దీంతో తాతా మధు వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శగా ముగుస్తాయా, అధికారిక చర్యలకు దారితీస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామం రాబోయే సమావేశాలపై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. నిబంధనల పరంగా స్పష్టత వచ్చిన తర్వాతే తదుపరి అడుగు పడనుంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ తన వాదనను బలంగా వినిపిస్తోంది. ఇదిలా ఉంటే అసెంబ్లీ సమావేశాల సమయంలో బీఆర్ఎస్ చేపట్టిన నల్లచొక్కాల నిరసన కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రతిపక్షం విమర్శలు చేస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చింది. అసెంబ్లీ గేట్ల వద్ద ఉద్రిక్తత ఏర్పడటంతో బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన కూడా చోటుచేసుకుంది. తాతా మధు వ్యాఖ్యలు బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాన్ని మించి పెద్ద చర్చకు కారణమయ్యాయి. అధికార పార్టీ ఇప్పుడు సభా మర్యాద, రాజ్యాంగ పదవుల గౌరవం అనే అంశాలను ముందుకు తెస్తోంది. బీఆర్ఎస్ మాత్రం నిరసన సందర్భంగా జరిగిన పోలీసుల వ్యవహారాన్ని ప్రశ్నిస్తోంది. ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ప్రవేశం, నిరసనలపై ఉద్రిక్తత కొనసాగుతుండగా తాతా మధు వివాదం పరిస్థితిని సంక్లిష్టం చేసింది. ఈ పరిణామాలు సభా కార్యకలాపాలపై ప్రభావం చూపుతాయా అనేది చూడాల్సి ఉంది. ఇప్పటికే రెండు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఇరు పక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా అంశాన్ని మలచుకుంటున్నాయి. మొత్తంగా తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరో వివాదానికి తెరలేపాయి. ఒకవైపు ప్రతిపక్ష హక్కులు, మరోవైపు సభా గౌరవం అనే రెండు అంశాలు ఇప్పుడు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. వ్యాఖ్యలపై అధికారికంగా ఏ చర్య తీసుకుంటారన్నది తదుపరి కీలక పరిణామంగా మారింది. ప్రివిలేజ్ నోటీసు లేదా కమిటీ విచారణ జరిగితే ఈ అంశం మరింత కాలం రాజకీయ చర్చలో ఉండే అవకాశం ఉంది. అదే సమయంలో బీఆర్ఎస్ కూడా ప్రభుత్వంపై తన నిరసనను కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ వేదికగా ఇరు పక్షాల మధ్య మాటల దాడి తీవ్రం కావచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. తాతా మధు వ్యాఖ్యలపై తుది నిర్ణయం వెలువడే వరకు ఈ వివాదం తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించనుంది. సభా నియమాలు, ప్రజాప్రతినిధుల బాధ్యత, రాజకీయ నిరసన పరిమితులపై కూడా తాజా పరిణామం చర్చకు దారి తీస్తోంది. దీంతో సమావేశాల తదుపరి రోజులు మరింత వాడివేడిగా సాగే అవకాశముంది. రాజకీయంగా ఎవరు పైచేయి సాధిస్తారన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

## ప్రతిపక్షాలపై పోలీసుల దాడి అప్రజాస్వామికం

**ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని అడ్డుకోలేరు: - చిర్రా రవీందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** శాసనసభకు నల్లచొక్కాలతో హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని శేరిలింగంపల్లి ఉద్యమ నేత చిర్రా రవీందర్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే ప్రతిపక్ష హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడం, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. పోలీసుల అత్యుత్సాహంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్లచొక్కాలను అడ్డుకోగలరేమో కానీ ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని ప్రభుత్వం అడ్డుకోలేదని ఆయన హెచ్చరించారు.

## ప్రజావాణికి 48 ఫిర్యాదులు

**పట్టణ ప్రణాళిక విభాగానికే 41 అర్జీలు.. సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ శ్రీజన ఆదేశం**




**సీఎంసీ ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీజన**

**సైబరాబాద్ విశాల భారతి :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సిఎంసి కమిషనర్ శ్రీజన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 48 అర్జీలు అందగా, పట్టణ ప్రణాళిక విభాగానికి 41, ఇంజినీరింగ్‌కు 5, పరిపాలన, పట్టణ జీవవైవిధ్య విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి.ప్రతి అర్జీని ప్రత్యేక ఫిర్యాదు గుర్తింపు సంఖ్యతో నమోదు చేసి, సమస్య పరిష్కార పురోగతిని తెలుసుకునేందుకు ట్రాకింగ్ లింక్ అందించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిర్ణీత గడువులోగా అవసరమైన చర్యలు తీసుకుని సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ శ్రీజన ఆదేశించారు.

## తెలంగాణ ఓటర్లకు బిగ్ రిలీఫ్




మొదటిపేజీ తరువాయి

పరిశీలించుకునే అవకాశం లభించింది. ముఖ్యంగా నోటీసులు అందని వారు, పేర్లు కనిపించని వారు, వివరాల్లో తప్పులు ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. తమ నియోజకవర్గానికి సంబంధించిన సమాచారాన్ని పరిశీలించి, సందేహాలు ఉంటే అధికారిక ఎన్నికల కార్యాలయాన్ని సంప్రదించాలి. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే తర్వాత సవరణకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సాధారణంగా ఓటర్ల జాబితా సవరణలో పేరు తొలగింపు, చిరునామా మార్పు, వ్యక్తిగత వివరాల్లో పొరపాట్లు వంటి అంశాలపై అభ్యంతరాలు నమోదవుతాయి. ఎవరైనా అర్హత ఉన్నప్పటికీ ముసాయిదా జాబితాలో పేరు లేకపోతే సంబంధిత ప్రక్రియ ద్వారా క్లెయిమ్ దాఖలు చేయవచ్చు. తప్పుగా నమోదైన పేర్లు లేదా అనర్హుల పేర్లపై అభ్యంతరాలు తెలియజేయడానికి కూడా అవకాశం ఉంటుంది. తెలంగాణలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను పరిశీలించారు. ఆ పరిశీలన తర్వాత రూపొందించిన ముసాయిదా జాబితాను ఆధారంగా చేసుకుని ప్రజలకు అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించారు. గడువు పొడిగింపుతో ప్రజలకు మరింత సమయం లభించనుంది. పత్రాలు సిద్ధం చేసుకోవడం, అవసరమైన దరఖాస్తులు సమర్పించడం, అధికారుల విచారణకు హాజరు కావడం వంటి పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తు చేసిన తర్వాత దాని స్థితిని తెలుసుకోవడం కూడా ముఖ్యం. అధికారులు నిర్వహించే విచారణలో అవసరమైన సమాచారం స్పష్టంగా ఇవ్వాలి. సరైన ఆధారాలు సమర్పిస్తే నిర్ణయం తీసుకోవడం సులభమవుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన అంశం అర్హులైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో ఉండేలా చూడటం. ఒక కుటుంబంలోని కొందరి పేర్లు ఉండి మరికొందరి పేర్లు లేకపోతే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారిని సంప్రదించాలి. పేరు, వయస్సు, లింగం, చిరునామా వంటి వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయడానికి కూడా అవకాశం ఉంది. ఇప్పటికే నోటీసులు అందుకున్న ఓటర్లు సూచించిన తేదీలో విచారణకు హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలి. బూత్ స్థాయి అధికారులు నోటీసుల పంపిణీ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాల్లో వేగం పెంచాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చిరునామాలు గుర్తించడం కష్టంగా ఉన్న సందర్భాల్లో బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే ఓటర్లు అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరం. నోటీసులను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో స్పందించాలి. కుటుంబ వివరాలను పరిశీలిస్తే తప్పులు ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. సమయపాలన. గడువు పెంపు నేపథ్యంలో రాజకీయ పార్టీలకు కూడా కీలక బాధ్యత ఏర్పడింది. తమకు చెందిన బూత్ స్థాయి ప్రతినిధుల ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు మిస్ కాకుండా చూడాల్సి ఉంటుంది. ఏదైనా అనుమానాస్పద తొలగింపు కనిపిస్తే వెంటనే అభ్యంతరం నమోదు చేయడం ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఎన్నికల సంఘం నిర్ణయించిన ప్రక్రియలో పారదర్శకత పాటించడం, ప్రతి ఫిర్యాదును ఆధారాలతో పరిశీలించడం కీలకం. తెలంగాణలో ఎస్ఐఆర్‌పై ఇప్పటికే రాజకీయ విమర్శలు, ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో గడువు పొడిగింపు ప్రాధాన్యం సంతరించుకుంది. అధికార యంత్రాంగం పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించడంతో పాటు నోటీసులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రజలు రాజకీయ ప్రచారాలపై ఆధారపడకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని సూచిస్తున్నారు. ఓటు హక్కు రక్షణకు ప్రతి అర్హుడూ తన వివరాలను స్వయంగా పరిశీలించడం అవసరం. భిన్నాభిప్రాయాలు ఉన్నా ఓటర్ల హక్కుల విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు. ప్రతి అభ్యంతరాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించడం ద్వారా జాబితాపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. ప్రస్తుతం తెలంగాణ ఓటర్లు చేయాల్సిన ముఖ్యమైన పని తమ పేరు ముసాయిదా జాబితాలో ఉందో లేదో నిర్ధారించుకోవడం. పేరు కనిపించకపోతే, వివరాల్లో పొరపాటు ఉంటే, తప్పుగా వర్గీకరణ జరిగితే నిర్ణీత విధానంలో క్లెయిమ్ లేదా అభ్యంతరం సమర్పించాలి. అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేయడం మంచిది. అక్టోబర్ 7 గడువు దాటిన తర్వాత అవకాశం పరిమితం కావొచ్చనే ఉద్దేశంతో చివరి తేదీ వరకు వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తుది ఓటర్ల జాబితా తయారీలో ప్రతి అర్హుడి పేరు ఉండటం ప్రజాస్వామ్య ప్రక్రియకు కీలకం. ఎస్ఐఆర్‌లో భాగంగా జరుగుతున్న పరిశీలనపై ప్రజలు బాధ్యతగా స్పందిస్తే తప్పులు తగ్గే అవకాశం ఉంటుంది. రాజకీయ పార్టీలతో పాటు పౌర సమాజం కూడా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఓటు హక్కు ప్రజాస్వామ్య బాధ్యత. ప్రతి ఓటరూ అప్రమత్తంగా ఉండాలి. అధికారిక వెబ్‌సైట్లు, ఎన్నికల కార్యాలయాలు, బూత్ స్థాయి అధికారులు అందించే సమాచారాన్నే ఆధారంగా చేసుకోవాలి. తప్పుడు ప్రచారాలను నమ్మకుండా నిర్ధారించుకోవాలి.

# రేవంత్-కేసీఆర్ కొత్త గేమ్!

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పనితీరుపై ప్రజలతో మాట్లాడాలని కేసీఆర్ చూస్తున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే ఇది రేవంత్ వర్సెస్ కేసీఆర్ కంటే అసెంబ్లీ వర్సెస్ స్ట్రీట్ ఫైట్‌గా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఇద్దరి రాజకీయ లెక్కలు చాలా స్పష్టంగా ఉన్నాయి. రేవంత్ రెడ్డి వ్యూహాన్ని చూస్తే లెక్క చాలా సింపుల్‌గా అర్థమవుతుంది. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేతగా సభకు వస్తే ప్రభుత్వంతో నేరుగా చర్చించాల్సి ఉంటుంది. ప్రశ్నలు అడగాలి, సమాధానాలు వినాలి, పాలనపై తన వాదనను అక్కడే బలంగా చెప్పాలి. అదే కేసీఆర్ సభకు రాకపోతే కాంగ్రెస్‌కు మరో ఆయుధం దొరుకుతుంది. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన నాయకుడు అసెంబ్లీకి ఎందుకు రావడం లేదనే ప్రశ్నను జనాల్లోకి తీసుకెళ్లొచ్చు. అంటే కేసీఆర్ వచ్చినా రేవంత్‌కు చర్చ వేదిక సిద్ధం. రాకపోయినా గైర్హాజరీపై రాజకీయ ప్రచారం చేసే ఛాన్స్ సిద్ధం. దీనికి తోడు గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఉప ఎన్నికకు సవాల్ చేయడం, సిరిసిల్లలో కేటీఆర్‌ను, సిద్దిపేటలో హరీశ్‌రావును ఎదుర్కొంటామని చెప్పడం కూడా ఒక పెద్ద మెసేజ్. బీఆర్ఎస్ టాప్ లీడర్లను వారి సొంత నియోజకవర్గాల్లోనే రాజకీయంగా ఇరుకున పెట్టాలన్న ఆలోచన ఇందులో కనిపిస్తోంది. అంటే రేవంత్ కేవలం విమర్శలు చేయడం కాదు, ప్రత్యర్థి బలమైన చోటే గేమ్ మొదలుపెట్టాలని చూస్తున్నారు. ఇదే ఆయన రాజకీయ గేమ్‌లో కీలక అడుగుగా కనిపిస్తోంది. కేసీఆర్ మాత్రం రేవంత్ పెట్టిన ట్రాక్‌లో పరుగెత్తకుండా తన దారి తానే ఎంచుకుంటున్నట్లు కనిపిస్తున్నారు. అసెంబ్లీలో రోజూ అధికార పార్టీతో మాటల యుద్ధం చేయడం కంటే, ప్రజల్లోకి వెళ్లి అసలు



సమస్యలపై ఫోకస్ పెట్టాలని చూస్తున్నారు. ఇక్కడే ఆయన ప్లాన్ ఆసక్తికరంగా మారుతోంది. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు అనే చర్చ కొనసాగితే బీఆర్ఎస్‌నే వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ సాగునీరు, రైతులు, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలు ముందుకు వస్తే కథ మొత్తం మారిపోతుంది. అప్పటివరకు ప్రశ్నలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్, ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థితిలోకి వెళ్లొచ్చు. ఉద్యమానికి నీటిని ఎంచుకోవడం వెనుక తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ టచ్ చేయాలన్న లెక్క కనిపిస్తోంది. నీళ్లు, ప్రాజెక్టులు, రైతులు అనే అంశాలు తెలంగాణ రాజకీయాల్లో బలమైన ఎమోషన్‌ను కలిగిస్తాయి. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను చర్చలోకి తెచ్చి, తన పాలనలో చేసిన పనులపై కథనం నిర్మించుకోవాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వాన్ని నేరుగా ప్రజల ముందే నిలదీయాలని కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్ స్వయంగా ప్రజాక్షేత్రంలోకి వస్తే దాని ప్రభావం పార్టీపై కూడా పడుతుంది. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై గట్టిగానే పోరాడుతున్నారు. కానీ కేసీఆర్ స్థాయిలో పెద్ద కదలిక కనిపించకపోవడం కేడర్‌లో నిరాశకు కారణమయ్యే అవకాశం ఉంది. ఇప్పుడు ఆయనే బయటకు వచ్చి భారీ ఉద్యమానికి నాయకత్వం వహిస్తే పార్టీ శ్రేణులకు కొత్త ఎనర్జీ రావచ్చు. జిల్లాల్లో కార్యకర్తలు యాక్టివ్ కావచ్చు. ప్రజా సమస్యలపై సభలు, ర్యాలీలు, పర్యటనలు పెరగొచ్చు. అయితే ఈ స్ట్రీట్ ఫైట్‌లో రిస్క్ ఉంది. అసెంబ్లీకి రాకపోవడంపై కాంగ్రెస్ ప్రశ్నిస్తూనే ఉంటుంది. ప్రజల కోసం పోరాడుతున్నానంటే అదే ప్రజా సమస్యలను అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించడం లేదని రేవంత్ అడగవచ్చు. దీంతో కేసీఆర్‌కు రెండు ఫ్రంట్‌లు ఓపెన్ అవుతాయి. ఒకటి ప్రభుత్వంపై పోరాటం, రెండోది అసెంబ్లీ గైర్హాజరీకి రాజకీయ సమాధానం చెప్పడం. జనసమీకరణ భారీగా జరిగినా, ప్రజల దృష్టిలో ప్రధాన ప్రశ్న మాత్రం మారకపోతే వ్యూహం వర్క్ అవుతుందని చెప్పలేం. అందుకే రోడ్డు పోరాటంతో పాటు రాజకీయంగా నేరేటివ్‌ను కంట్రోల్ చేయడం కేసీఆర్‌కు కీలకం. ఇప్పుడు తెలంగాణలో అసలు గేమ్ ఎవరి చేతిలోకి వెళ్తుందన్నదే ఆసక్తికరంగా మారింది. రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను అసెంబ్లీకి లాగాలని చూస్తున్నారు. అక్కడ ముఖాముఖి చర్చ జరిగితే తన ప్రభుత్వ పనితీరును చెప్పుకునే అవకాశం ఉంటుంది. కేసీఆర్ రాకపోతే అదే విషయాన్ని ప్రజల్లో పెద్ద ప్రశ్నగా మార్చే అవకాశం ఉంటుంది. కేసీఆర్ మాత్రం ఈ గేమ్‌లోకి వెళ్లకుండా సాగునీరు, రైతులు, ఉద్యోగాలు వంటి అంశాలతో నేరుగా జనాల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. ఉద్యమం సక్సెస్ అయితే బీఆర్ఎస్ మళ్లీ ప్రజా చర్చలోకి బలంగా రావచ్చు. ప్రభుత్వంపై ఒత్తిడి పెరగొచ్చు. కానీ కాంగ్రెస్ అసెంబ్లీ గైర్హాజరీని ప్రధాన అంశంగా మార్చగలిగితే రేవంత్ వ్యూహం పైచేయి సాధించవచ్చు. అందుకే ఇది కేవలం ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం కాదు. ఎవరు ఎంచుకున్న వేదికలోకి ప్రజలను తీసుకురాగలరో, ఎవరు ఎజెండాను తమ చేతుల్లో ఉంచుకోగలరో తేల్చే గేమ్. అసెంబ్లీ వర్సెస్ స్ట్రీట్ పోరులో చివరికి గెలిచేది ఎక్కువగా మాట్లాడిన నాయకుడు కాదు. ప్రజల మనసులో అసలు ప్రశ్న ఏదిగా నిలిచిందో, దానికి సమాధానం ఇచ్చిన నాయకుడే. తెలంగాణలో రోజులు అందుకే కీలకంగా మారుతున్నాయి.

# స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు

మొదటిపేజీ తరువాయి

ఈ అంశం సమావేశాల్లో ప్రధాన చర్చగా మారింది. ఈ అంశంపై కాంగ్రెస్ శ్రేణులు గట్టిగా స్పందించాయి. తాతా మధు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ గత పాలనపై కూడా విమర్శలు గుప్పించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ ఆ మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. మూడెకరాల భూమి హామీ, దళిత ఉపముఖ్యమంత్రిని తొలగించిన ఘటనలను సీఎం గుర్తుచేశారు. నేరెళ్ల ఘటనను ప్రస్తావిస్తూ దళితుల పట్ల అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ హయాంలో దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్‌కు స్పీకర్ పదవి దక్కడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేదన్న భావనను ఆయన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం తగదని రేవంత్ స్పష్టం చేశారు. స్పీకర్ కుర్చీకి పార్టీలు, వ్యక్తులతో సంబంధం ఉండదని, సభను నడిపించే అత్యున్నత బాధ్యత ఆ పదవికి ఉందని చెప్పారు. అందువల్ల మాటల విషయంలో ప్రతి సభ్యుడు సంయమనం పాటించాలని సూచించారు. సభలో మాట్లాడే మాటకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. దీంతో సభలో రాజకీయ ఉద్రిక్తత కొనసాగింది. సభలో నిర్ణయాలపై బీజేపీ చేసిన డిమాండ్లకు కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. ఏ అంశంపైనైనా నిర్ణయం




తీసుకునే ముందు విస్తృత చర్చ జరగడం శాసనసభ సంప్రదాయమని ఆయన పేర్కొన్నారు. చర్చ లేకుండా నిర్ణయం తీసుకోవాలన్న ఒత్తిడి వెనుక కొన్ని ప్రయోజనాలు దాగి ఉన్నాయని విమర్శించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సభలో చర్చ జరిగిన తర్వాతే విచారణకు ఆదేశాలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి అయినా ఎమ్మెల్యే అయినా స్పీకర్ స్థానాన్ని గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. సభా కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు స్పీకర్‌కు సహకరించడం ప్రతి సభ్యుడి బాధ్యతగా అభివర్ణించారు. రాజకీయ విభేదాలు వ్యక్తిగత దూషణలకు దారితీయకూడదని సూచించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు సభలో మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో తాతా మధు వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సంకేతాలు ఇచ్చారు. వ్యవహారం మరింత రాజకీయ వేడిని పెంచింది. ఈ పరిణామంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య విమర్శలు మరింత పదునెక్కాయి. ప్రభుత్వం సంయమనం పాటిస్తున్న విషయాన్ని బీఆర్ఎస్ నేతలు బలహీనతగా భావించవద్దని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో రాజ్యాంగ వ్యవస్థలను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తే సహించబోమని స్పష్టం చేశారు. స్పీకర్ మనసు గాయపడేలా చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునే పరిస్థితిని తెచ్చాయని ఆయన అన్నారు. తాతా మధు వ్యవహారంలో కేసీఆర్ నేరుగా స్పందించి ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ అధినేతగా తన ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలపై బాధ్యత తీసుకోవాలని కోరారు.తాతా మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పీకర్‌ను కలిసి సంఘీభావం ప్రకటించి, ఎమ్మెల్సీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఈ వివాదం అసెంబ్లీ పరిధిని దాటి ప్రధాన అంశంగా మారింది. బీఆర్ఎస్ వైపు నుంచి వచ్చే తదుపరి స్పందనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కేసీఆర్ తక్షణ వైఖరి ఈ వివాదానికి ప్రాధాన్యం తెచ్చే అవకాశముంది. బీఆర్ఎస్ స్పందన కోసం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. ఈ పరిణామం అధికార పార్టీకి రాజకీయ ఆయుధంగా మారింది. మొత్తంగా స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో దుమారం కారణమయ్యాయి. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని దళిత గౌరవం, రాజ్యాంగ సంస్థల పరిరక్షణ అంశంగా ముందుకు తీసుకెళ్తుండగా, మరోవైపు బీఆర్ఎస్ ఈ పరిణామంపై తన రాజకీయ వ్యూహాన్ని నిర్ణయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశం మరింత చర్చకు దారితీసే అవకాశం కనిపిస్తోంది. తాతా మధుపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది కీలకంగా మారింది. కేసీఆర్ బహిరంగంగా స్పందిస్తారా, క్షమాపణ చెబుతారా అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. స్పీకర్ పదవికి ఉన్న గౌరవం విషయంలో అన్ని పార్టీలు ఒకే వైఖరిని ప్రదర్శించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజకీయ పోరాటాలు సహజమైనప్పటికీ, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు అవసరమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ వివాదం రాబోయే రోజుల్లో సభలో, బయట రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా నిలిచే అవకాశముంది. తదుపరి పరిణామాలు కీలకం కానున్నాయి.

# పబ్స్.. బార్లపై పోలీసుల కొరడా





- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- మైనర్లకు ప్రవేశం లేదు.. హుక్కా నిర్వహిస్తే కేసులు
- సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం రమేష్

సైబరాబాద్,విశాల భారతి



నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు నిర్వహించే హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్, హుక్కా సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ హెచ్చరించారు. చట్టబద్ధమైన అనుమతులు, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆడిటోరియంలో సంబంధిత శాఖల అధికారులు, హోటళ్లు, బార్లు, పబ్స్, హుక్కా సెంటర్ల నిర్వాహకులతో సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

**అనుమతులు తప్పనిసరి..**

ప్రతి వ్యాపార సంస్థకు అవసరమైన అన్ని అనుమతులు, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని సీపీ సూచించారు. ఫైర్ శాఖ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల నుంచి అవసరమైన అనుమతులు పొందాలన్నారు. సీపీ పోర్టల్ ద్వారా పొందిన లైసెన్సుల గడువు ముగిసిన వెంటనే పునరుద్ధరించుకోవాలని సూచించారు. సైబరాబాద్ పరిధిలో లైసెన్సులు పొందిన సంస్థల సంఖ్యతో పోలిస్తే హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్స్ పెద్ద సంఖ్యలో కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొన్ని సంస్థలు సరైన అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.

**సమయం దాటితే చర్యలే..**

బార్లు, పబ్స్ నిర్ణీత సమయాలను తప్పనిసరిగా పాటించాలని సీపీ స్పష్టం చేశారు. అనుమతించిన సమయం ముగిసిన తర్వాత మద్యం విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలు కొనసాగించరాదన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లలోకి మైనర్లను అనుమతించకూడదని స్పష్టం చేశారు. సంస్థల్లో పనిచేసే సిబ్బంది గుర్తింపు, ఆధార్, వయస్సు ధ్రువీకరణ వివరాలను యాజమాన్యాలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా మైనర్లను పనిలోకి తీసుకోవద్దన్నారు.

**గొడవలకు తావివ్వొద్దు...**

హోటళ్లు, పబ్స్, రెస్టారెంట్లలో వినియోగదారుల ప్రవర్తనపై యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు లేదా ప్రముఖుల బంధువులమని చెప్పుకునే వారికి కూడా నిబంధనల నుంచి ఎలాంటి మినహాయింపు ఉండదన్నారు. బార్లు, పబ్స్‌లో గ్యాంగ్‌ల మధ్య ఘర్షణలకు అవకాశం లేకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాల వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

**హుక్కా నిర్వహిస్తే కఠిన చర్యలు...**

తెలంగాణలో హుక్కా కార్యకలాపాలు నిషేధించబడిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ హుక్కా సెంటర్లు నిర్వహించరాదని సీపీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టబద్ధంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి పోలీసులు సహకరిస్తారని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై మాత్రం చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ప్రారంభోత్సవంలో వసూళ్ల రచ్చ

- డబ్బులివ్వలేదని సెలూన్ యజమానికి బెదిరింపులు
- ట్రాన్స్‌జెండర్లకు పోలీసుల కౌన్సెలింగ్

సైబరాబాద్ - విశాల భారతి

నూతనంగా ప్రారంభించిన ఒక వ్యాపార సముదాయం వద్ద చోటుచేసుకున్న చందాల గొడవ పోలీసు స్టేషన్ మెట్లెక్కింది. శుభకార్యాలు, ప్రారంభోత్సవాల పేరుతో జరుగుతున్న బలవంతపు వసూళ్లపై పోలీసులు కఠినంగా వ్యవహరించారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగి, నిందితులపై కేసులు నమోదు చేయడమే కాకుండా, ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై చట్టపరమైన విచారణ తప్పదని హెచ్చరించారు.సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లో ఇటీవల ఒక కొత్త సెలూన్ ప్రారంభమైంది. ఆ సమయంలో అక్కడకు వచ్చిన ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు తమకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలని యజమానిని డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వడం సాధ్యం కాదని ఆయన నిరాకరించడంతో వాతావరణం వేడెక్కింది. డిమాండ్ చేసిన సొమ్ము ఇవ్వకపోతే తమ సమాజానికి చెందిన మరికొందరిని ఇక్కడికి రప్పించి తీవ్ర న్యూసెన్స్ చేస్తామని, దుకాణం నడవకుండా చూస్తామని బెదిరింపులకు దిగారు. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ యజమానిపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు.బాధితుడు ధైర్యం చేసి జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించడంతో ఈ వసూళ్ల భాగోతం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ సమాజ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పండుగలు, గృహప్రవేశాలు, వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాల సమయాల్లో గుంపులుగా వెళ్లి ప్రజలను, వ్యాపారులను భయాందోళనలకు గురిచేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేశారు. బలవంతపు వసూళ్లకు పాల్పడినా, అసభ్యంగా ప్రవర్తిస్తూ రోడ్లపై రచ్చ చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ నడుచుకోవాలని, ప్రజలకు ఆటంకం కలిగిస్తే కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని జీడిమెట్ల ఎస్‌హెచ్ఓ కె. రవికుమార్ తేల్చిచెప్పారు.

# సింగరేణిలో మారుపేర్ల సమస్య

**మొదటిపేజీ తరువాయి**

సిఫార్సుల ఆధారంగా స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. శాసనమండలి సమావేశాల్లో ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ.. ఇది ఇటీవల ఉత్పన్నమైన సమస్య కాదని, 1997 నుంచే సింగరేణిలో కొనసాగుతున్న పాత (లెగసీ) సమస్య అని వివరించారు. అధికారిక రిజిస్టర్‌లో ఒకరి పేరు ఉంటే, వారి స్థానంలో మరొకరు వచ్చి విధుల్లో పనిచేస్తున్న పరిస్థితులు ఉండేవని, చట్టప్రకారం ఒకరి పేరు మీద మరొకరు ఉద్యోగం చేయడం తీవ్రమైన నేరపూరితమైన అంశమైనప్పటికీ, కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకొని సింగరేణి యాజమాన్యం గతంలో మానవీయ కోణంలో పరిష్కరించేందుకు ప్రయత్నించిందని గుర్తుచేశారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆ సమయంలో 45 మంది అధికారులతో పాటు సంబంధిత వ్యక్తులపైనా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సింగరేణిలో ప్రస్తుతం దాదాపు 90 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, ఈ మారుపేర్ల సమస్యను ఎదుర్కొంటున్న వారి సంఖ్య కేవలం 128 మాత్రమేనని భట్టి విక్రమార్క తెలిపారు. ఇది భారీ సంఖ్యలో ఉన్న పెద్ద సమస్య కాకపోయినప్పటికీ, చట్టపరమైన చిక్కులు ఉన్నందున అధికారులు ఈ సమస్యను పరిష్కరించేందుకు భయపడుతున్నారని చెప్పారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మహాధర్నా




- విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం వద్దు
- ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

శేరిలింగంపల్లి - విశాల భారతి

విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా, ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రక్షణ సేన శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో మదీనాగూడ గాంధీ సర్కిల్ నుంచి చందానగర్ ఓల్డ్ గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా, స్కూటీల పంపిణీ వంటి హామీలను నెరవేర్చాలని అన్నారు.ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కుమార్, దయానంద్ ముదిరాజ్, సందీప్ డిసోజు, విష్ణు, రఘు, పవన్‌తో పాటు విద్యార్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేరగాళ్లకు పోలీసుల చెక్

- 5 కేసులు ఛేదన, రూ.19 లక్షల సొత్తు లభ్యం
- రెండు రోజుల్లోనే జగద్గిరిగుట్ట కేసుల గుట్టురట్టు
- నిందితుల అరెస్టు

సైబరాబాద్ - విశాల భారతి




కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇన్స్పెక్టర్ సురేష్

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు వేర్వేరు కేసులను పోలీసులు కేవలం రెండు రోజుల్లోనే విజయవంతంగా ఛేదించారు. నేరాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, మరికొన్ని వెండి వస్తువులు, మొబైల్ ఫోన్ తో పాటు రూ.10 లక్షల విలువైన బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు ఏసీపీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రరెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందాలు వేగంగా దర్యాప్తు జరిపి ఈ సొత్తును స్వాధీనం చేసుకున్నాయి.బాధితురాలిని నమ్మించి మోసానికి పాల్పడిన కేసులో మార్కాపురానికి చెందిన కామినెడ్డి శివమోహన్‌రెడ్డి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ అవసరాలు, ఆసుపత్రి ఖర్చుల పేరుతో ఓ మహిళ వద్ద నుంచి రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారాన్ని తీసుకుని అతడు పరారయ్యాడు. ఆ బంగారాన్ని కంభంలోని కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు.మరో ఘటనలో అస్బెస్టాస్ కాలనీలో వరుస ఇళ్ల చోరీలకు పాల్పడుతున్న గరికపాటి వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడు మూడు ఇళ్లలో చొరబడి మొబైల్‌ఫోన్, వెండి వస్తువులు, 3 గ్రాముల బంగారం, రూ.60 వేల నగదును దొంగిలించినట్లు స్పష్టమైంది. అలాగే ఈవీ ఛార్జింగ్ కేంద్రంలో జరిగిన చోరీ కేసులో అక్కడ పనిచేస్తున్న తోట గురువప్ప అనే ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కోటి రూ.2.50 లక్షల విలువ చేసే నాలుగు బ్యాటరీలను దొంగిలించి స్క్రాప్ దుకాణంలో విక్రయించగా, రూ.10 లక్షల విలువైన ఆ బ్యాటరీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే వరుస కేసులను ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

- గొంతు నులిమి హత్య చేసినట్లు నిర్ధారణ
- రూ.20 వేల జరిమానా

సైబరాబాద్ - విశాల భారతి



భార్యను గొంతు నులిమి హత్య చేసిన కేసులో భర్తకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. మంచిరేవుల గ్రామానికి చెందిన పొన్న నాగేశ్వరరావు అలియాస్ నాగేష్ (47)కు ఈ శిక్ష పడింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది.2004లో కల్పనను నాగేశ్వరరావు వివాహం చేసుకున్నాడు. కుటుంబ, ఆర్థిక సమస్యలతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. 2017 అక్టోబరు 5న సిగరెట్ విషయమై ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఆ తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన నాగేశ్వరరావు మరోసారి గొడవకు దిగి, కల్పన గొంతు నులిమి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి, అక్టోబరు 7న నిందితుడిని అరెస్టు చేశారు. సాక్షుల వాంగ్మూలాలు, వైద్య ఆధారాల ఆధారంగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో దర్యాప్తు అధికారి జి.వి. రమణగౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. కృష్ణమూర్తి సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో నిందితుడికి శిక్ష పడినట్లు డీసీపీ క్రైమ్స్ ఎ. ముత్యం రెడ్డి తెలిపారు.

# కూకట్‌పల్లిలో బహిరంగ ప్రదేశంలో అసాంఘిక కార్యకలాపాలు

- భాగ్యనగర్‌లో అల్లూరి ట్రేడర్స్ వద్ద పోలీసుల దాడులు
- 19 మంది మహిళలు అదుపులోకి

సైబరాబాద్ - విశాల భారతి

కూకట్‌పల్లి పోలీస్, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 19 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. మెట్రో స్టేషన్ సమీపంలోని భాగ్యనగర్‌లో అల్లూరి ట్రేడర్స్ వద్ద రాత్రి సమయంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. బహిరంగ ప్రదేశంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించడంతో అక్కడ ఉన్న 19 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పురుషులను ఆకర్షించేలా సంకేతాలు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు.ముందస్తు సమాచారంతో కూకట్‌పల్లి పోలీసులు, ఎస్‌వోటీ సిబ్బంది సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని గుర్తించి విచారణ చేపట్టారు. అనంతరం 19 మంది మహిళలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.




# గురువే సమాజానికి మార్గదర్శి

- శేరిలింగంపల్లిలో ఘనంగా గురుపూజోత్సవం
- 35 మంది ఉపాధ్యాయులకు సత్కారం

శేరిలింగంపల్లి,విశాల భారతి

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శేరిలింగంపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 35 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపిక, పగిడి, తాంబూలాలతో సాంప్రదాయబద్ధంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆచార్య రాములు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత సమాజంలో గురువులదే అత్యున్నత స్థానమని పేర్కొన్నారు. విద్యాబుద్ధులతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.



శాలువా మెమొంటోతో సన్మానించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో ఉపాధ్యాయుల

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం సుభాష్ చంద్రారెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం బసవలింగం, అసోసియేషన్ ప్రతినిధులు అమ్మయ్య చౌదరి, వాణి సాంబశివరావు, ఉమా చంద్రశేఖర్, దాతలు తూనిక రాఘవేంద్రరావు, యు.వి. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కారులో మంటలు.. వ్యక్తి సజీవ దహనం!

- బౌరంపేట్‌లో విషాద ఘటన..
- కుటుంబ కలహాలే కారణమా?

సైబరాబాద్ – విశాల భారతి



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. బౌరంపేట్‌లో ఓ వ్యక్తి కారులో కూర్చొని నిప్పంటించుకోవడంతో మృతి చెందాడు. రాధాకృష్ణ (40)గా పోలీసులు గుర్తించారు.స్థానికుల సమాచారం ప్రకారం.. రాధాకృష్ణ కారులో ఉండగానే మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా కారంతా వ్యాపించడంతో ఆయన బయటకు రాలేకపోయినట్లు తెలుస్తోంది. కారు పూర్తిగా దగ్ధమైన అనంతరం స్థానికులు ఘటనను గమనించి అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే రాధాకృష్ణ మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే రాధాకృష్ణ ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దర్యాప్తు పూర్తయితే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

- వినాయక చవితి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
- పనుల నాణ్యతలో రాజీ వద్దు
- జోనల్ కమిషనర్ నారాయణ అమిత్

శేరిలింగంపల్లి- విశాల భారతి




శేరిలింగంపల్లి జోన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పౌర సేవలు, రానున్న వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇంజినీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, పారిశుధ్యం తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.జోన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇంజినీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నారాయణ అమిత్ ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగర సుందరీకరణలో భాగంగా మొక్కల పెంపకం, పార్కుల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను ఆదేశించారు.

**వినాయక చవితికి పటిష్ట చర్యలు..**

రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువుల వద్ద లైటింగ్, రహదారుల మరమ్మతులు, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలను ముందుగానే కల్పించాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ పౌర సేవలను మరింత మెరుగుపరచాలని నారాయణ అమిత్ స్పష్టం చేశారు.

# విశాల భారతి కథనాలపై స్పందన.. కురవి భూములపై సీఎం కార్యాలయం ఆరా!

- వరుస కథనాలపై ఉన్నతస్థాయిలో కదలిక
- కలెక్టర్ ద్వారా వివరాల సేకరణకు ఆదేశాలు?
- 275 ఎకరాల ప్రభుత్వ, సీలింగ్, పీఓటీ, భూదాన్ భూములపై ఫిర్యాదులు
- సర్వే నంబర్ 177తో పాటు ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణకు డిమాండ్

**మహబూబాబాద్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి):** మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల ఆరోపణలు, రికార్డుల పరిశీలనపై 'విశాల భారతి' దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు స్పందన లభించినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల అంశంపై ప్రచురితమైన కథనాల నేపథ్యంలో తెలంగాణ సీఎం కార్యాలయం జిల్లా కలెక్టర్ ద్వారా వివరాలు ఆరా తీస్తున్నట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, అబాది, సీలింగ్, పి.ఓ.టి., భూదాన్ తదితర భూములపై అనుమానాలు, ఆక్రమణల ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ ఇటీవల ' విశాల భారతి' వరుస కథనాలను ప్రచురించింది. ముఖ్యంగా సర్వే నంబర్ 177తో పాటు ప్రభుత్వ భూములను గుర్తించి, సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు అధికారులను కోరుతున్నారు.


## కురవి సర్కారు భూములకు రక్షణ కరువు..!

**కురవి విశాలభారతి:**
మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములపై కబ్జా ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రికార్డుల ప్రకారం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విలువైన భూములు క్షేత్రస్థాయిలో కొందరి స్వాధీనంలో ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక రికార్డుల్లో మాత్రం భూములు ప్రభుత్వ భూములుగానే కనిపిస్తున్నప్పటికీ, వాటిపై జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకునే చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**275 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి..**
కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇందులో 43 ఎకరాల 09 గుంటల అబాది భూమి, 158 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమి, మరో 11 ఎకరాల 19 గుంటల సీలింగ్ భూమి ఉన్నట్లు చెబుతున్నారు. ఇంత భారీస్థాయిలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండటంతో దాని పరిరక్షణపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**రికార్డుల్లో సర్కారు.. కబ్జాలో ప్రైవేటు?**
ప్రభుత్వ భూములపై కొందరు ప్రభావశీలులు చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భూములపై హక్కులు, ఆక్రమణలు, వినియోగం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయి సర్వే నిర్వహించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సర్వే నంబర్ 177పై ప్రత్యేక దృష్టి**
కురవి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 177, బై నంబర్లలో ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని పలువురు ఇప్పటికే అధికారులను కోరారు. భూముల హద్దులను నిర్ధారించి, ప్రభుత్వ ఆస్తిగా గుర్తిస్తూ అధికారికంగా బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**కలెక్టర్, ప్రజావాణిలో ఫిర్యాదులు.**
ఇప్పటికే కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు, దళిత నాయకుడు దైద భద్రయ్య, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఇరుగు వెంకన్న, సీనియర్ వార్డు సభ్యుడు నూతక్కి సాంబశివరావు తదితరులు సర్వే నంబర్ 177తో పాటు బై నంబర్లపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్, కురవి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

**సీపీఐ నేతల వినతి.. బోర్డులు ఏర్పాటు చేయాలి.**
మరోవైపు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, కురవి పట్టణ కార్యదర్శి తురక రమేష్ తదితరులు కూడా కురవి పరిధిలోని ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించి, అధికారిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

**ఫిర్యాదులు ఎన్నో.. చర్యలు ఎక్కడ?**
ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు రెవెన్యూ యంత్రాంగంలో ఆశించిన స్థాయిలో కదలిక కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యేలోపే అధికారులు స్పందించి సమగ్ర సర్వే, హద్దుల నిర్ధారణ, ప్రభుత్వ బోర్డుల ఏర్పాటు, ఆక్రమణలపై విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయా? ఎవరి ఆధీనంలో ఉన్నాయి? రికార్డులు ఏం చెబుతున్నాయి? క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై రెవెన్యూ శాఖ సమగ్ర విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



విశాల భారతి Main Edition Page 4 07 Sep 2026
For Advertisement Call +91 99121 62531

**275 ఎకరాల భూములపై విచారణకు డిమాండ్.**
కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో రికార్డుల ప్రకారం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ, ఇతర కేటాయింపు భూములు ఉన్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. ఇందులో అబాది 43 ఎకరాల 09 గుంటలు, సీలింగ్ 11 ఎకరాల 19 గుంటలు, ప్రభుత్వ భూమి 158 ఎకరాల 18 గుంటలు, పి.ఓ.టి. భూములు 57 ఎకరాల 35 గుంటలు, భూదాన్ భూమి 4 ఎకరాలు ఉన్నట్లు వారు వెల్లడించారు. ఈ భూములన్నింటినీ క్షేత్రస్థాయిలో సర్వే చేసి, రికార్డులతో సరిపోల్చి, ఆక్రమణలు లేదా అక్రమ బదలాయింపులు జరిగాయా అనే అంశాన్ని నిగ్గు తేల్చాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.

**సర్వే నంబర్ 177పై ప్రత్యేక దృష్టి.**
కురవి గ్రామంలోని సర్వే నంబర్ 177లో ఉన్న ప్రభుత్వ భూములపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు భవిష్యత్‌లో ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**'విశాల భారతి' ఎక్స్ పోస్టులకు స్పందన.**
ప్రభుత్వ భూముల అంశంపై ప్రచురించిన వరుస కథనాలను ' విశాల భారతి' జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బానోత్ దేవేందర్ బ్యూరో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలంగాణ సీఎస్, సీఎం కార్యాలయం, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం కార్యాలయం స్పందించి జిల్లా కలెక్టర్ ద్వారా కురవి ప్రభుత్వ భూముల అంశంపై వివరాలు సేకరిస్తున్నట్లు అధికారుల ద్వారా సమాచారం వెలువడింది.

**వాస్తవాలు వెలుగులోకి రావాలనే డిమాండ్.**
కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములపై వస్తున్న ఆరోపణలు, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణలు, అక్రమ బదలాయింపులు లేదా రికార్డులలో అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.' విశాల భారతి' వరుస కథనాలపై ఉన్నతస్థాయిలో స్పందన రావడంతో కురవి ప్రభుత్వ భూముల వ్యవహారంపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపడుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది..

## ఎస్ఆర్ హాస్పిటల్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**మహబూబాబాద్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి ):** మహబూబాబాద్ పట్టణంలోని హరికిషన్ మిల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, వైద్యులు, నాయకులు ఆసుపత్రి సేవలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ శాసనసభ్యులు బాణోత్ శంకర్ నాయక్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కుమారి బిందు అంగోత్, గుగులోత్ శ్రీరామ్ నాయక్, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి, యాళ్ల మురళీధర్ రెడ్డి, విజయ్ సారధి, మూల మధుకర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్, బాలు నాయక్, వెంకట్ రాములు, నెహ్రూ నాయక్, కోమల్, దీప్తి, గోపిలాల్, రాణా ప్రతాప్, బాలు చౌహన్, కీర్తి, సతీష్, గార్లపాటి వెంకట్ రెడ్డి, ముత్యం వెంకన్న, కొమ్మినేని రవీందర్, నాయిని రంజిత్, మహబూబ్ పాషా, బానోత్ జగదీష్ నాయక్, అంగోత్ శ్రీకాంత్ నాయక్, ఐలి నరహరి, గుగులోత్ నెహ్రూ నాయక్, బండ బిక్షం రెడ్డి, బొడ శ్రీను నాయక్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా..



**మోటకొండూర్, విశాలాభారతి :** అసెంబ్లీ ప్రాంగణంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మోటకొండూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, దిష్టిబొమ్మల శవయాత్ర నిర్వహించారు. కేటీఆర్, హరీశ్‌రావు, తాతా మధు దిష్టిబొమ్మలను ఊరేగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు క్యాసగల్ల చందు మాట్లాడుతూ, దళిత నాయకులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు తాతా మధు క్షమాపణ చెప్పాలని కోరారు. అలాగే తాతా మధుపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో PACS చైర్మన్ నెమ్మణి సుబ్రమణ్యం, జిల్లా నాయకులు భూమండ్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బుగ్గ శ్రీశైలం, సీనియర్ నాయకులు పబ్బతి శశిధర్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ బుగ్గ కొమురయ్య, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు జూకంటి మధు, ATM డైరెక్టర్ రేగు రమేష్, పాల సంఘం చైర్మన్ వంగపల్లి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ రేగు శ్రీనివాస్, బల్దా సిద్దులు, గిరబోయిన మల్కయ్య, సీనియర్ నాయకులు కొల్లూరి యాదగిరి, కొల్లూరి బిక్షపతి, బోట్ల నాగులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పంతంగి ఉదయ్ కిరణ్, మోట మల్లేష్, భూమండ్ల వెంకటేష్, వార్డు సభ్యులు గువ్వ మురళి, NSUI అధ్యక్షులు ఇప్ప మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్బండ జాతుల గొంతుక ఎర్ర ఉపాళి ఆశయాలను కొనసాగిస్తాం



**ఆలేరు, విశాలాభారతి :** జంబూద్వీప మహాదికవి, సబ్బండ జాతుల గుండె గొంతుక ఎర్ర ఉపాళి ఆశయాలను కొనసాగించేందుకు యువత కృషి చేయాలని యువకవి, రచయిత భైరపాక స్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. ఎర్ర ఉపాళి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులాధిపత్యానికి వ్యతిరేకంగా ఎర్ర ఉపాళి నిత్యం పోరాడుతూ, తన కలం నుంచి ఎన్నో ఉద్యమ గీతాలను అందించి దళిత జాతులలో చైతన్యం నింపేందుకు కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ఆయన పాటలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. సబ్బండ జాతుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఎర్ర ఉపాళి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన రచనలు, పాటలు నేటికీ అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని రగిలిస్తున్నాయని పేర్కొన్నారు. ఎర్ర ఉపాళి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల రాష్ట్ర నాయకులు గ్యార నరేష్ మాదిగ, బోడ శ్రీకాంత్, సీపీఐ పట్టణ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాసరాజు, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కందుల మధు, సింగర్ కళా శంకర్, అందే అఖిల్, చెక్క రాజు, రంజిత్, బోడ నరేష్, రామచర్ల సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు ఇక ఆన్‌లైన్‌లోనే పోలీస్ అనుమతి

**చౌటుప్పల్,విశాల భారతి**

గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు చౌటుప్పల్ పోలీసులు శుభవార్త చెప్పారు. ఇకపై గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి .మన్మధ కుమార్ ఈ విషయాన్ని తెలిపారు.




**అనుమతి ఎలా పొందాలి?**
తెలంగాణ స్టేట్ పోలీస్ అధికారిక పోర్టల్ లోకి వెళ్లి గణేష్ ఉత్సవాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. అందులో మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల పూర్తి వివరాలు నమోదు చేయాలి. పోలీస్ అధికారులు వివరాలను పరిశీలించి Qr కోడ్ తో కూడిన డిజిటల్ ఎన్ఓసి ని ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు. దీంతో అనుమతి ప్రక్రియ మరింత సులభంగా, పారదర్శకంగా, వేగంగా జరుగుతుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

**నిర్వాహకులు పాటించాల్సిన నియమాలు:**
ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలి.తప్పనిసరిగా విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలి. అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించాలి.ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతతో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ జి.మన్మధ కుమార్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం 100 / 112 కు కాల్ చేయాలని సూచించారు.

## బోర్లు, బావుల కింద కూరగాయల సాగు చేపట్టాలి



**ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం పొందే అవకాశం**

**మహబూబాబాద్ స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి):** బోర్లు, బావుల కింద నిత్య ఆదాయం అందించే అన్ని రకాల కూరగాయల సాగును రైతులు చేపట్టాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరిష్, ఐఏఎస్ ఆదేశాల మేరకు మిషన్ వైవిధ్యం కార్యక్రమం ద్వారా పంట మార్పిడిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా 10 వేల ఎకరాల్లో కూరగాయల సాగు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 2 వేల ఎకరాల్లోనే సాగవుతోందని, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కూరగాయల సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగడంతో పాటు గ్రామీణ యువత, స్వయం సహాయక సంఘాలకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సోమవారం నెల్లికుదురు మండలం సీతారాంపురం గ్రామంలో కూరగాయల పందిరి సాగు, మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టమాట, వంకాయ, బెండ, బీర, సొరకాయ, కాకరకాయ, పచ్చిమిరప, గోరుచిక్కుడు, ఆకుకూరలు, బీట్‌రూట్, క్యారెట్, ముల్లంగి, క్యాబేజీ, కాలీఫ్లవర్, కంద, చేమ, దొండ, పొట్లకాయ, ఉల్లి తదితర కూరగాయలకు నిత్యం మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని వివరించారు. సంవత్సరానికి 3 నుంచి 4 పంటలు తీసుకుంటూ ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం పొందవచ్చని మరియన్న తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాదిరిగా ప్రతి నెలా ఆదాయం వచ్చేలా కూరగాయల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టవచ్చన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, మిరప సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పలు రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాన్సర్ నివారణలో కూరగాయలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, అన్ని రకాల కూరగాయలను ప్రకృతి సేద్యం పద్ధతిలో సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. "అన్ని రకాల కూరగాయలు తినండి.. క్యాన్సర్‌ను ద్వేషించండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## ఆరు గ్యారెంటీల అమలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి:తీగల దయాకర్ గౌడ్

**దేవరుప్పుల విశాల భారతి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,ఇతర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ దేవరుప్పుల మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ దేవరుప్పుల తహసీల్దార్ అశ్వక్ అహ్మద్ కి,ఎంపీడీఓ మేనకా పౌడేల్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయినా హామీల అమలుపై స్పష్టత ఇవ్వకపోవడం తీవ్రంగా బాధాకరమని,మాటలు,ప్రచారాలు కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టాలని,ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదని,హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన ఉద్యమం కొనసాగుతుందని అన్నారు.

## ఎస్ జి ఎఫ్ టోర్నమెంట్ మోడల్ లెవెల్ సెలక్షన్ ప్రారంభం



**విశాలభారతి, గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని బాలుర జెడ్పీ హెచ్ ఎస్ పాఠశాలలో 70 వ ఎస్ జి ఎఫ్ మండల్ లెవెల్ టోర్నమెంటు కం సెలక్షన్ బాయ్స్ అండ్ గర్ల్స్ 17 ఇయర్స్ వాలీబాల్ కబడ్డీ కోకో ఆటలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఏ సుజాత మేడం . గూడూరు సర్పంచి వాంకుడోత్ సునీత కొమ్మాల్ . కొమ్మాలు జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు. బీరం శ్రీపాల్ రెడ్డి . రేగ పాపారావు ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్. ఎస్ సత్యనారాయణ పిజి హెచ్ఎం బాయ్స్ నా గూడూరు. సి హెచ్ అర్జున్ ఎఫ్.ఎ. సి.హెచ్ఎం పొనుగోడు. ఏ శ్రీలత ఎఫ్.ఎ.సి హెచ్ఎం గర్ల్స్ గూడూరు. జి లక్ష్మి ఎస్ జి ఎఫ్ జోనల్ సెక్రెటరీ. బుర్కా పుష్పలీల మండల సెక్రెటరీ. జి బిక్షపతి పిడి. ఎస్ వెంకన్న. జి రాణి. వెంకటేశ్వర్లు. టి వెంకటేశ్వర్లు. ఎం ప్రవీణ్. కే నాగేష్. నిర్మల.రజిత. శ్రీను. సుమలత వ్యాయామ ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

## స్క్రాప్‌కు అమ్మినా పన్ను బకాయి తప్పదు

- తుక్కుగా విక్రయించే ముందు ఆర్టీఏకు సమాచారం తప్పనిసరి
- పన్ను బకాయిలు చెల్లించకుంటే పెనాల్టీలు పెరుగుతాయి:
- రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్



**మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి:** వాహనాలను స్క్రాప్ (తుక్కు) కింద విక్రయించే యజమానులు రవాణా శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ సూచించారు. ముఖ్యంగా బస్సులు, లారీలు, ఇతర వాణిజ్య వాహనాలను స్క్రాప్‌కు విక్రయించే ముందు ఆర్టీఏ అధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. జిల్లాలో పన్ను బకాయిలున్న వాహన యజమానులకు ఆర్టీఏ అధికారులు నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో, కొందరు యజమానులు తమ వాహనాలను ఇప్పటికే తుక్కుగా విక్రయించామని చెబుతున్నారని తెలిపారు. అయితే వాహనాన్ని స్క్రాప్‌కు విక్రయించినంత మాత్రాన దానిపై ఉన్న పన్ను బకాయిలు రద్దు కావని శంకర్ నాయక్ స్పష్టం చేశారు. పన్నులు చెల్లించకుండా వాహనాన్ని స్క్రాప్‌కు విక్రయిస్తే, ఆ బకాయి యజమాని పేరుపైనే కొనసాగుతుందని పేర్కొన్నారు. బకాయిలను సకాలంలో చెల్లించకపోతే పెనాల్టీలు పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల స్క్రాప్‌కు విక్రయించే ముందే పన్ను బకాయిలను చెల్లించి, ఆర్టీఏకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. పన్నులు చెల్లించని వాహన యజమానులు మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లు లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించుకోవచ్చని తెలిపారు. అనవసరమైన పెనాల్టీలకు గురికాకుండా పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. మోటార్ వెహికల్స్ యాక్ట్-1988లోని సెక్షన్ 55 ప్రకారం నిబంధనలకు అనుగుణంగా లేని వాహనాల రిజిస్ట్రేషన్‌పై రద్దు వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. వాహన యజమానులు రవాణా శాఖ నిబంధనలను పాటిస్తూ పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## కురవిలో తాతా మధు దిష్టిబొమ్మ దహనం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన



**మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి:** దళిత శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కురవి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు కురవి గుడి సెంటర్‌లో ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేయనున్నట్లు కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా, మండల నాయకులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన శాసనసభ స్పీకర్ పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అలాంటి పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు

## అర్హులైన రైతులందరూ డేటా నమోదు చేసుకోవాలి

- గూడూరు వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్



**(విశాల భారతి )సెప్టెంబర్ 7:** 7 రకాల వరి వంగడాలు సాగు మరియు ఆన్లైన్ నమోదు ప్రాధాన్యత వానాకాలం-2026లో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 7 రకాల వరి వంగడాల సాగును ప్రోత్సహించడం. డీలర్ వద్ద విత్తనం కొనుగోలు చేసిన రైతుల వివరాలను డీలర్ ద్వారా పోర్టల్‌లో నమోదు చేయాలి స్వంత విత్తనం లేదా ఇతర రైతుల నుంచి పొందిన విత్తనం ఉపయోగించే రైతులు రైతు ధృవీకరణ పత్రం సమర్పించాలి. మొత్తం రైతు డేటా ఎంట్రీ, ధృవీకరణ ప్రక్రియను 10092026లోపు పూర్తి చేయాలి.అర్హత ఉన్న రైతులెవరూ డేటా నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా ప్రత్యేకంగా గుర్తించాలి. ఈ యొక్క డేటా ను సివిల్ సప్లై డిపార్ట్మెంట్ కు అందిస్తారు , వారు మాత్రమే కొనుగోలు కేంద్రాలు కు మరియు 500 బోనస్ కు అర్హులు.

## వంతెన కోసం గళమెత్తితే అడ్డుకుంటారా?



**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :** ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఘట్కేసర్ వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆర్అండ్‌బీ అధికారులకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న తమను చిక్కడపల్లి పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారని, అరెస్టు చేసేందుకు ప్రయత్నించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యపై అధికారులను కలిసేందుకు వెళ్తున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘట్కేసర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల బాధ్యత అని అన్నారు. ''ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎందుకింత భయం? ప్రజల కోసం గళమెత్తడమే నేరమా?'' అంటూ పోలీసుల తీరును ప్రశ్నించారు. అడ్డంకులు, ఒత్తిళ్లతో ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఘట్కేసర్ వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తి కాకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. వంతెన నిర్మాణం ఆలస్యం కావడం వల్ల నిత్యం రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ నాయకులు ఆర్అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్ జీ. వనజను కలిసి ఘట్కేసర్ వంతెన నిర్మాణానికి సంబంధించిన సమస్యలను వివరించారు. వంతెన నిర్మాణం ఆలస్యం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని బీజేపీ నాయకులు అన్నారు. పోలీసుల అడ్డంకులకు భయపడేది లేదని, ఘట్కేసర్ వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మంగు రాధిక, మాధవి, బీజేవైఎం అధ్యక్షుడు అనిల్‌గౌడ్, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, సురేందర్, బండ్లగూడ కిషోర్, జవహర్‌నగర్ అధ్యక్షుడు కమలాకర్, బండారు పవన్‌రెడ్డి, శివనాయక్, అజయ్‌యాదవ్, బాలు యాదవ్, గుండె నరేష్, వీరారెడ్డి, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశాలను బుట్టదాఖలు చేసిన అధికారులు

- కాంగ్రెస్ నేత మండల చంద్రయ్య ఆరోపణ
- అక్రమంగా చెరువు నీటి తరలింపుపై చర్యలేవి?
- ప్రజావాణి అర్జీని పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు



**మునగాల, (విశాలభారతి):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదులకు మునగాల మండల అధికారులు కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదని, కలెక్టర్ ఆదేశాలనే బుట్టదాఖలు చేస్తున్నారని మునగాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల చంద్రయ్య తీవ్రంగా ఆరోపించారు. మండల పరిధిలోని కలకోవ గ్రామంలోని ఊర చెరువు నుండి కొంతమంది వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా మోటార్లు పెట్టి, పైప్‌లైన్ల ద్వారా చెరువు ఆయకట్టుతో ఏమాత్రం సంబంధం లేని భూములకు అక్రమంగా నీటిని తరలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరుతూ గత ఆగస్టు 24న కలకోవ గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక రైతులు సంతకాలతో కూడిన దరఖాస్తును జిల్లా కలెక్టర్ గారికి అందజేశారని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని మునగాల మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశించి రోజులు గడుస్తున్నా మునగాల మండల స్థాయి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కనీసం ఫీల్డ్ మీదికి వచ్చి పరిశీలించిన పాపాన పోలేదని చంద్రయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే చట్ట వ్యతిరేక పద్ధతుల్లో చెరువు నీళ్లు తరలిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

## హామీలను వెంటనే అమలు చేయాలి: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత



**మునగాల, (విశాలభారతి):** ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మునగాల బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు మహాలక్ష్మి, రైతు భరోసా, వ్యవసాయ కూలీల భృతి, వరి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ వంటి కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలన్నారు. అలాగే గతంలో నిలిపివేసిన కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, దళితబంధు తదితర పథకాలను పునరుద్ధరించి పేదలు, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సుంకర అజయ్ కుమార్, కందిబండ సత్యనారాయణ, రామిరెడ్డి, రాంపంగ సుందర్, బూసి వెంకటేశ్వర్లు, కోలా ఉపేంద్రరావు, ఉడుం కృష్ణ, ప్రదీప్, సైదా, మణికంఠ, దొంగరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ చట్టాలను అమలు చేయకపోతె రిలే నిరాహార దీక్షలు చెప్పడతాం

**ఏ ఎన్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్**



**వాజేడు సెప్టెంబర్ 7 విశాల భారతి:** మండల పరిధిలో గిరిజ నేతరులు అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తూ ఉన్నారని ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ ఆరోపించారు. పంచాయతీ అధికారులు పర్మిషన్ లేకుండ వలస గిరిజనేతరులు బహుళ అంతస్తులు నిర్మిస్తూ ఉంటే చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. వాజేడు మండల ఎంపీడీఓ కృపాకర్ కు సోమవారం గ్రీవెన్స్ లో వినతిపత్రం అందజేశారు. మండలం లో అన్ని గ్రామపంచాయతీ ల్లో పెసా గ్రామసభలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాన్నారు. మండలం లో చెరుకూరు, మండపాక, వాజేడు, మండల కేంద్రంలో యదేచ్ఛగా వలస గిరిజనేతరులు స్థానిక గ్రామపంచాయతీ ల అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణలు చేపడుతున్నారని ఎల్ టీ ఆర్, పెసా చట్టాలను ఉల్లంఘించిన వారి పై, అధికారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కు తెలిపారు. షెడ్యూల్ చట్టాలను అమలు చేయకపోతే ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చెప్పడతామని అన్నారు. ఈ కార్యక్రమం లో ANS ఆదివాసి నవనిర్మాణ సేనా మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు సోషల్ మీడియా అధ్యక్షుడు పాయం అజయ్ కుమార్, కంబాలపల్లి హరినాద్, తల్లాడి ప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

## కురవి నాగార్జున స్కూల్‌పై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలి

- నాగార్జున స్కూల్‌పై ఆరోపణలు.. అధికారుల మౌనం ఎందుకు?
- అనుమతులు, గుర్తింపు, భవన భద్రతపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలి
- గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవు
- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్

**కురవి విశాల భారతి:** కురవి మండల కేంద్రంలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్‌కు సంబంధించిన పలు అంశాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అధికారులు ఇకనైనా మౌనం వీడి తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కురవిలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కురవి గ్రామపంచాయతీ పరిధిలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్ భవన నిర్మాణాలు, నిర్మాణ అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు, భవన భద్రత తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల భవనానికి ఉన్న అనుమతులు, అదనపు నిర్మాణాలకు గ్రామపంచాయతీ నుంచి అనుమతులు ఉన్నాయా? విద్యాశాఖ గుర్తింపు నిబంధనల ప్రకారం ఉందా? భవన నిర్మాణం, విద్యార్థుల భద్రతకు సంబంధించిన ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేయాలని కోరారు. ఆరోపణలు వచ్చినా విచారణలో జాప్యం చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని దేవేందర్ అన్నారు. గ్రామ పంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు విచారణలో తేలితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అదే విషయాన్ని అధికారులు అధికారికంగా ప్రజలకు వెల్లడించాలని అన్నారు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరదించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. అలాగే గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని అమలు చేసి, సమగ్ర విచారణ నిర్వహించి, విచారణ నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుండా జాప్యం చేస్తే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు నవీన్, విక్రమ్, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# హామీలను వెంటనే అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మునుగోడు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మందుల సత్యం
- ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

**మునుగోడు విశాల భారతి**





సోమవారం మండల కేంద్రం లో నిర్వహించిన ఎంపీడీవో కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మందుల సత్యం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు మహిళలకు నెలకు రూ.2,500 , రైతులకు ఎకరాకు రూ.15,000 రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12,000, వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి , 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , ఇందిరమ్మ ఇళ్లు , ఆసరా పెన్షన్ల పెంపు , రూ.2 లక్షల పంట రుణమాఫీ తదితర ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ , కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ , రైతుబంధు , రైతుబీమా , ఆసరా పెన్షన్లు , కంటి వెలుగు , గొర్రెల పంపిణీ తదితర సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అర్హులైన ప్రజలకు అందించాలని కోరారు. రైతులు , మహిళలు , నిరుద్యోగులు, వ్యవసాయ కూలీలు , పేదలు , వృద్ధులు , వితంతువులు తదితర వర్గాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించకుండా తక్షణమే అమలు చేయాలని మందుల సత్యం డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గతంలో అమలు చేసిన పథకాలను కూడా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదనబోయిన పరమేష్, నల్లగొండ అంజి, పగిళ్ల సతీష్, పూలవెంకటేశం, నకిరేకంటి మురళీకృష్ణ, ఈద శరత్ బాబు, జంగిలి సాంబయ్య, వరంగంటి శంకర్, యడవెల్లి సురేష్, అయితగోని విజయ్ ,బోయపర్తి సురేందర్, నందిపాటి వెంకన్న, దోటి కరుణాకర్, బండారు శ్రీనివాస్, కట్ట రమేష్, ఉప్పునూతల శ్రీశైలం, పందుల సురేష్, అయితరాజు శ్రీశైలం, గురజాల శ్రవణ్, బోయపర్తి సైదులు, హరిబాబు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కురవిలో ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరపాలి

- 275 ఎకరాల ప్రభుత్వ, సీలింగ్, పి.ఓ.టి, భూదాన్ భూముల రక్షణకు కలెక్టర్‌కు ఫిర్యాదు
- రికార్డులు బహిరంగపరచి.. ఆక్రమణలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి) :**



మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, సీలింగ్, భూదాన్, పి.ఓ.టి, ప్రజాప్రయోజన భూముల పరిరక్షణకు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య తదితరులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ, ఇతర కేటాయించిన భూములు ఉన్నట్లు తెలిపారు. ఇందులో అబాది 43 ఎకరాల 09 గుంటలు, సీలింగ్ భూములు 11 ఎకరాల 19 గుంటలు, ప్రభుత్వ భూమి 158 ఎకరాల 18 గుంటలు, పి.ఓ.టి భూములు 57 ఎకరాల 35 గుంటలు, భూదాన్ భూమి 4 ఎకరాలు ఉన్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

**ఆక్రమణలను అరికట్టాలి :**

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కాలువలు తదితర ప్రజాప్రయోజన స్థలాలపై జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఆక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అడ్డుకోవాలని కోరారు. ప్రతి ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేసి, సరిహద్దులను గుర్తించి ఫెన్సింగ్ లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**రికార్డులు బహిరంగపరచాలని డిమాండ్ :**

ప్రతి భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, భూమి స్వభావం, ప్రస్తుత స్థితి, ఆక్రమణ వివరాలు స్పష్టంగా పొందుపరిచిన నివేదికను గ్రామ పంచాయతీ కార్యాలయంలో, సంబంధిత ఆన్‌లైన్ వేదికల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు.

**రెవెన్యూ–రిజిస్ట్రేషన్ రికార్డులపై విచారణ :**

ధరణి, పాత రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ శాఖ పత్రాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించాలని ఫిర్యాదుదారులు కోరారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి, రికార్డుల్లో మార్పులు, అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయా అనే అంశాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

**పి.ఓ.టి భూములపై చర్యలు తీసుకోవాలి.**

పి.ఓ.టి/అసైన్డ్ భూముల విషయంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు, విక్రయాలు లేదా ఆక్రమణలు జరిగి ఉంటే వాటిని గుర్తించి, నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. చెరువులు, శిఖం భూములు, నీటి వనరులు, కాలువల ఆక్రమణలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం రెవెన్యూ యంత్రాంగం ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ.. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచి, ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య తదితరులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## కురవి ప్రభుత్వ భూములపై కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు



- ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలి
- సర్వే నంబర్ 177లో ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి
- అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలి
- దైద భద్రయ్య, నూతకి సాంబశివరావు, కిన్నెర మల్లయ్య, ఇరుగు వెంకన్న డిమాండ్

**మహబూబాబాద్ స్టాఫ్ రిపోర్టర్ విశాల భారతి) :**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలని, సర్వే నంబర్ 177లో ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ గౌరవ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ మహబూబాబాద్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల భద్రత, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై అధికారులు సమగ్రంగా స్పందించాలని ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేశారు.

**ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలి :**

ప్రస్తుతం ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహ భవన పరిస్థితులను పరిశీలించి, విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, భద్రతా సదుపాయాలు కలిగిన సురక్షిత భవనంలోకి వసతిగృహాన్ని మార్చాలని కోరారు. విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వ భూముల కబ్జాలపై సమగ్ర విచారణ:**

కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అక్రమ ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా భూముల బదలాయింపులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సర్వే నంబర్ 177ను పరిరక్షించాలి:**

కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 177లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు అక్రమంగా చేతులు మారకుండా రికార్డులను పరిశీలించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రజావాణి ఫిర్యాదులో దైద భద్రయ్య – దళిత అవార్డు గ్రహీత, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు; నూతకి సాంబశివరావు – వార్డు సభ్యులు; కిన్నెర మల్లయ్య – సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత; ఇరుగు వెంకన్న – కురవి మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు పాల్గొని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత శాఖల అధికారులతో చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ నాయకులు



**తిరుమలగిరి, విశాల భారతి :** తిరుమలగిరి మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రానివ్వకుండ పోలీసులను పెట్టి దౌర్జన్యంగా అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేసి నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ & బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సంకేపల్లి రఘునందన్ రెడ్డి, మాజీ ఎంపీపి కొమ్మినేని సతీష్‌కుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మోడెపు సురేందర్, కౌన్సిలర్లు జక్కుల రమేష్, పత్తెపురం త్రిశుల్, యాకుబ్ నాయక్, కో ఆప్షన్ సభ్యులు పాషా, జావేద్ అలీ, సర్పంచులు బర్ల వెంకన్న, రవి నాయక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంకెపల్లి నరోత్తమ్ రెడ్డి, ధూపటి రవీందర్, కందుకూరి ప్రవీణ్, మధు, సందీప్ నేత, పనికేర యాదగిరి, మోడెపు వీరన్న, యాదగిరి, కిషోర్ రెడ్డి, నాగరాజు, రవి, సుమన్, రమేష్, విజయ్, సోమచారి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ నిధులు విడుదల చేయాలి



**తిరుమలగిరి, విశాల భారతి :** తిరుమలగిరి మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడివో ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రగతి ఆర్ట్స్ & సైన్స్ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థుల పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగయ్య, యాజమాన్యం నరోత్తమ్ రెడ్డి, నర్సయ్యలు పాల్గొన్నారు.

## తాడిపర్తిలో ఘనంగా పోచమ్మ, పెద్దమ్మ బోనాలు

**అమ్మవార్లకు బోనం సమర్పించిన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నీలం రాములు దంపతులు**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండలం పరిధిలోని తాడిపర్తి గ్రామంలో పోచమ్మ పెద్దమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా తాడిపర్తి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీలం రాములు దంపతులు పోచమ్మ తల్లికి ముదిరాజ్ పెద్దమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గ్రామాన్ని ఎల్లవేళలా క్షేమంగా చూడాలని, వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవార్లను వేడుకున్నారు. తాడిపర్తి గ్రామ దేవతలు ఎల్లవేళలా గ్రామ ప్రజలను క్షేమంగా చూస్తారని కొనియాడారు.ఈ బోనాల ఉత్సవాల్లో గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్లకు బోనాలు సమర్పించారు.

## జిల్లా ఉత్తమ అవార్డు పొందిన పిడి శ్రీనివాస్ చారి

**అభినందనలు తెలిపిన ఉపాధ్యాయ బృందం**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న శ్రీనివాస్ చారి. యాచారం మండలం నంది వనపర్తి పి ఎం శ్రీ పాఠశాలలో పిడి( ఫిజికల్ డైరెక్టర్)గా పనిచేస్తున్న శ్రీనివాస్ చారి ఉత్తమ అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన క్రీడలను, విద్యార్థుల ప్రగతికి పాఠశాల అభివృద్ధికి ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డును ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ శాస్త్రి ఉపాధ్యాయ బృందం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణం అని తెలిపారు.

## జాతీయ రహదారి, ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఆర్డీవోకు బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ వినతి**



**చౌటుప్పల్,విశాల భారతి:** పట్టణ కేంద్రంలోని 65వ జాతీయ రహదారి విస్తరణ, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతుండటంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు.వాహనాలను ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపైకి మళ్లించడంతో అక్కడ నిత్యం ట్రాఫిక్ రద్దీ పెరిగి తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని తెలిపారు.ముఖ్యంగా సెలవు రోజుల్లో ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర సేవల వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజలు రహదారి దాటేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు, పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో తాత్కాలిక ప్రత్యామ్నాయ రహదారులను ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్డీవోను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, 4వ వార్డు ఊదరి యాదయ్య, 15వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిర, అంకిరెడ్డి గూడెం సర్పంచ్ ,సర్పంచ్ల ఫోరం తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ & చౌటుప్పల్ మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్, మల్కాపురం సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్, చౌటుప్పల్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, గ్రంధాలయం మాజీ చైర్మన్ ఊడుగు మల్లేష్ గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, ఎండి మున్నా, తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతర కృషి అవసరం
- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు



**కోదాడ, (విశాలభారతి):**

నిరుద్యోగం నేడు మన సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యావంతులైన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య ఒక్కరోజులో లేదా ఒక్క జాబ్ మేళాతో పూర్తిగా పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతర, ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను నియామక సంస్థలతో నేరుగా అనుసంధానం చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తన 32 ఏళ్ల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సాధ్యమైనంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేశానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రయత్నాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు.సెప్టెంబర్ 19వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కోదాడ పట్టణంలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, అవసరమైన ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుందని తెలిపారు. 2025 అక్టోబర్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్ మెగా జాబ్ మేళాకు దాదాపు 40 వేల మంది నమోదు చేసుకోగా, 20,463 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని గుర్తుచేశారు. వారిలో 2,041 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 1,533 మంది తదుపరి నియామకాల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. మొత్తం 3,574 మంది యువతకు ప్రత్యక్షంగా లేదా భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశం లభించిందన్నారు. కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి ఎన్. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా జాబ్ మేళా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ ఎంపీ కె. రఘువీర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వైస్ ఛైర్‌పర్సన్ మల్లేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోటేశ్వరరావుతో పాటు పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. అభ్యర్థుల నమోదు, కంపెనీల భాగస్వామ్యం, ప్రచారం, ఇంటర్వ్యూ సదుపాయాలు, రవాణా, భద్రత, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కమిటీ సమన్వయం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమ తేదీ సమీపించే నాటికి మరికొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులను నిర్వహణ కమిటీలో చేర్చనున్నట్లు తెలిపారు. నిర్వహణ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో జరుగుతుందని వెల్లడించారు.

## తాగునీటి కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**వారం రోజులుగా నీటి సరఫరా నిలిపివేతపై కాలనీ వాసుల ఆందోళన**






**రాజేంద్రనగర్, విశాల భారతి :** తాగునీటి కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా వారం రోజులుగా నీటి సరఫరా నిలిపివేత.. సమస్య పరిష్కరించాలని డిమాండ్సం జయ్ గాంధీ నగర్ కాలనీ, యాదయ్య నగర్ కాలనీ, ఇండస్ వ్యాలీ, సాయి బాలాజీ నగర్, వెంకటేశ్వర కాలనీ, 60 స్క్వేర్ యార్డ్స్ ప్రాంతాల్లో గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, రోజువారీ అవసరాలకు కూడా నీరు అందక అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆయా కాలనీలకు చెందిన ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి. వినయ రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొని నీటి సరఫరా పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. గత వారం రోజులుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు కారణాలను గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటిని నిరంతరాయంగా అందించేలా చర్యలు చేపట్టాలని, భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు కోరారు.

## జన్వాడలో అక్రమ లేఅవుట్‌పై అధికారుల ఉక్కుపాదం

**అక్రమ నిర్మాణాలు కూల్చివేత.. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు**







**రాజేంద్రనగర్, విశాల భారతి :** జన్వాడ గ్రామంలో అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి టౌన్ ప్లానింగ్ విభాగం, హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్‌ను ధ్వంసం చేయడంతో పాటు, అక్కడ చేపట్టిన అక్రమ నిర్మాణాలు, నిర్మాణ భాగాలను అధికారులు కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. భూ యజమానులు, డెవలపర్లు, ప్రజలు సంబంధిత శాఖల నుంచి అన్ని అనుమతులు పొందిన తర్వాతే లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచించారు. అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేయడం, నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. జన్వాడతో పాటు నార్సింగి సర్కిల్ పరిధిలో అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలపై తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## వినాయక చవితి నవరాత్రులు శాంతియుతంగా జరుపుకోవాలి : మంచాల సీఐ మధు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** వినాయక చవితి పండుగ సందర్భంగా మంచాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి కమిటీ సమావేశం మంచాల సీఐ మధు ఆధ్వర్యంలో రాబోయే వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని, మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామ సర్పంచులు ముఖ్య నాయకులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ (Peace Committee) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మధు మాట్లాడుతూ ఈ సమావేశంలో పండుగను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై విస్తృతంగా చర్చించారు.

**ముఖ్య సూచనలు:** శాంతిభద్రతల పరిరక్షణ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడాలని, అన్ని వర్గాల ప్రజలు పరస్పర సామరస్యంతో మెలగాలని నిర్వాహకులకు సూచించారు. డీజే (DJ) సౌండ్ సిస్టమ్‌లపై పూర్తి నిషేధం: ఉత్సవాలలో, మండపాల వద్ద గానీ, నిమజ్జన ఊరేగింపులలో గానీ డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**భద్రతా చర్యలు:** మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన విద్యుత్ వైరింగ్ ఉపయోగించి విద్యుత్ శాఖ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు.

**ట్రాఫిక్ నియంత్రణ:** విగ్రహాల ఏర్పాటు ఊరేగింపు సమయంలో వాహనాల రాకపోకలకు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పాటించాలి.

**మండపాల పర్యవేక్షణ:** మండపాల వద్ద నిర్వాహకులు నిరంతరం అందుబాటులో ఉంటూ, భద్రత దృష్ట్యా అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ పోలీసు వారికి సహకరించి, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని ప్రజలకు, నిర్వాహకులకు పిలుపునిచ్చారు.




## హామీలను అమలు చేయాలి సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీఆర్ఎస్
- ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం

**మోతె, సెప్టెంబర్ 7 విశాల భారతి**

సోమవారం మండల కేంద్రం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు మహిళలకు నెలకు రూ.2,500, రైతులకు ఎకరాకు రూ.15,000 రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12,000, వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి , 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , ఇందిరమ్మ ఇళ్లు , ఆసరా పెన్షన్ల పెంపు , రూ.2 లక్షల పంట రుణమాఫీ తదితర ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ , కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ , రైతుబంధు , రైతుబీమా , ఆసరా పెన్షన్లు , కంటి వెలుగు , గొర్రెల పంపిణీ తదితర సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అర్హులైన ప్రజలకు అందించాలని కోరారు. రైతులు , మహిళలు , నిరుద్యోగులు, వ్యవసాయ కూలీలు , పేదలు , వృద్ధులు , వితంతువులు తదితర వర్గాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించకుండా తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గతంలో అమలు చేసిన పథకాలను కూడా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శీలం సైదులు యాదవ్ , జిల్లా నాయకులు ఆరే లింగారెడ్డి , బీఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి మద్ది మధుసూదన్ రెడ్డి , మాజీ సర్పంచులు బానోత్ వెంకన్న , గుండాల గంగులు , భూక్యా గాంధీ , ఇండ్ల వెంకటేశ్వర్లు , నవీన్ , నకిరేకంటి మల్లయ్య , నిమ్మల రవి , మూడ్ బిక్షం , రామకోటి , నగేష్ , సాయి తదితర బీఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతాంగ పోరాటానికి రణధీరుడు.. రావి నారాయణరెడ్డి




- ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహాయోధుడు..
- ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం : సీపీఐ నేతలు

**అబ్దుల్లాపూర్‌మెట్,విశాల భారతి :**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన మహాయోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు రావి నారాయణరెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. ఆయన 35వ వర్ధంతి సందర్భంగా సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్-2లోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమంలో రావి నారాయణరెడ్డి ఒక ఆదర్శవంతమైన నాయకుడిగా నిలిచారని అన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన పోషించిన చారిత్రక పాత్రను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడిన ఆయన తన సొంత భూమిలోని వందల ఎకరాలను పేదలకు పంచిపెట్టడంతో పాటు అనేక ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అధిక ఓట్లతో విజయం సాధించడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమన్నారు. హైదరాబాద్ సంస్థానంలో రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా అజ్ఞాతంలో గెరిల్లా దళాలను ఏర్పాటు చేసి ప్రజల విముక్తి కోసం పోరాడారని గుర్తుచేశారు.

ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన రావి నారాయణరెడ్డి ఆశయాలను నేటి తరం అందిపుచ్చుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో సీపీఐ ఆధ్వర్యంలో సాగిన భూపోరాటాల ఫలితంగా ఏర్పడిన రెండు కాలనీలకు ఆయన పేరు పెట్టడం ఆయనకు అందించిన గౌరవానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న భూపోరాటానికి కూడా రావి నారాయణరెడ్డి పేరు పెట్టి ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం పోరాడటమే ఆయనకు నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహతో పాటు కాటి అరుణ, పేరాల గోపి, దుప్పం నిరంజన్, ఆవుల యాదగిరి, సుజాత, దేవమ్మ, ఈశ్వరయ్య, బిచ్చు నాయక్, శంకర్‌నాయక్, రాము, మధు, కారంపొడి నర్సింహ, నన్నే సాబ్, రవి, అశోక్, అలివేలు, లోకియా, కావేరి, సంధ్య, వీణ, భాను, నర్సింహ, సూర్య, నీలా తదితరులు పాల్గొన్నారు.

## తాపీ మేస్త్రి మృతి పట్ల సిఐటియు సంతాపం

**మునగాల, (విశాలభారతి):** మునగాల మండలం నేలమర్రి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి జడిగల మంగయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిఐటియు అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అనంతల మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్ నేలమర్రి గ్రామానికి చేరుకుని మంగయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుడైన మంగయ్య ఆకస్మిక మరణం తోటి కార్మికులకు, కుటుంబానికి తీరని లోటన్నారు. ప్రమాదంలో కార్మికుడిని కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి ద్వారా లభించే ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

## ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఎంపికలు

**తిరుమలగిరి, విశాలభారతి :** సోమవారం రోజు మండలంలోని ఎమ్మార్సీ భవన్లో మండల విద్యాధికారి ఐ శాంతయ్య అధ్యక్షతన, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ల ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపికలు ఈనెల 9, అండర్ 14, 17 అమ్మాయిలకు, పదవ తారీఖున అండర్ 14,17 అబ్బాయిలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలగిరి నందు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు , వ్యాయామ ఉపాధ్యాయులు లు పాల్గొనడం జరిగింది.

## ఇచ్చిన హామీలు ఇంకెప్పుడు నెరవేరుస్తారు.

**బి ఆర్ ఎస్ పార్టీ నేత ముఠా జై సింహ**




**ముషీరాబాద్,విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న ఇచ్చిన హామీలు ఇంకెప్పుడు నెరవేరుస్తారని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ముఠా జయసింహ ప్రశ్నించారు. ఇచ్చిన హామీల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామని పేర్కొన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం దోమల్ గూడ ఈ సేవ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. మీడియా ఇంచార్జ్ ముచ్చ కుర్తి ప్రభాకర్ సమన్వయంలో జరిగిన కార్యక్రమానికి ముఠా జై సింహ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వేయి రోజులు గడిచిందని సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్.. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేసి సంబరాలు చేసుకోవాలని సూచించారు.అనంతరం ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పాటు ముషీరాబాద్ నియోజక వర్గంలో మెరుగైన వసతులు కల్పించాలని, అబివృద్ధి పనులు వేగవంతం చేయాలని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్కిల్ నెంబర్ 40,41 డీఎంసీ పుష్పలత, ఏఎంసి ప్రదీప్ చంద్ర కు గోనే సంచిలో వినతి పత్రాలను నింపి అధికారుల టేబుల్ మీద పెట్టి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ యాదవ్, రాకేష్ కుమార్, కొండ శ్రీధర్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, వై శ్రీనివాస్, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, సాయి కృష్ణ, పోతుల శ్రీకాంత్, దామోదర్ రెడ్డి, వల్లల శ్రీనివాస్ యాదవ్, రామచందర్, విద్యాసాగర్, రాజశేఖర్ గౌడ్, బింగి నవీన్, ప్రభాకర్, శ్రీహరి, టెంట్ హౌస్ వేణు సహ పలువురు పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజావాణికి 56 ఫిర్యాదులు

- ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
- ప్రజావాణిలో మొత్తం 56 ఫిర్యాదుల స్వీకరణ
- రెవెన్యూ శాఖకు 27, ఇతర శాఖలకు 29 వినతులు
- అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27, ఇతర శాఖలకు సంబంధించిన 29, మొత్తం 56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో 10వ తరగతి విద్యార్థి అదృశ్యం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 ఏళ్ల బాలుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెద్ద గోల్కొండ గ్రామానికి చెందిన యాపచెట్టు యాదగిరి కుమారుడు యాపచెట్టు నవతేజ్ (15) నాగారం జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 5న ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లిన నవతేజ్ సాయంత్రం 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. ఆలస్యంగా ఇంటికి రావడంతో తండ్రి అతడిని మందలించాడు. మరుసటి రోజు (6న) ఉదయం సుమారు 6.30 గంటలకు నిద్రలేచిన నవతేజ్ వాష్‌రూమ్‌కు వెళ్లి, అనంతరం ఇంటికి తిరిగి రాకుండా బయటకు వెళ్లిపోయాడు. కొంతసేపటికి కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో శంషాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి బాలుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన సమయంలో నవతేజ్ చామనచాయతో, సుమారు 5 అడుగుల ఎత్తు కలిగి, గ్రే రంగు టీషర్ట్, బ్లాక్ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తెలుగు మాట్లాడగలడని పేర్కొన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు శంషాబాద్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## స్పీకర్‌ను అవమానిస్తే సహించేది లేదు!

**తాతా మధు వ్యాఖ్యలు అసెంబ్లీ గౌరవానికే మచ్చ.. చర్యలు తీసుకోవాలి,**
**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**




**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు తాతా మధు మాట్లాడిన తీరుపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా, ఆయన కుటుంబాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలిచే శాసనసభలో ఇలాంటి భాషకు చోటు కల్పించడం సభా గౌరవానికే మచ్చగా అభివర్ణించారు. స్పీకర్‌పై జరిగిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని అవమానించిన ఘటనగా చూడరాదని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. దళిత నాయకత్వం పట్ల అవమానకర ధోరణిని ప్రదర్శించడమే కాకుండా, తెలంగాణ సమాజం మొత్తం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని విమర్శించారు. అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి ఘటనను ఒక **'చీకటి అధ్యాయం'**గా గుర్తుంచుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా రాజ్యాంగ పదవుల గౌరవాన్ని, సభా సంప్రదాయాలను కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని స్పష్టం చేశారు. సభా మర్యాదలను ఉల్లంఘించేలా వ్యవహరించిన శాసనమండలి సభ్యుడిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలను రాజకీయ ప్రయోజనాల కోసం సమర్థించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. స్పీకర్ కుటుంబాన్ని అవమానించే వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తక్షణమే స్పందించి క్షమాపణ చెప్పాలని మల్‌రెడ్డి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఇకపై ఏ ప్రజాప్రతినిధి అయినా రాజ్యాంగ వ్యవస్థలను, సభా గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించకుండా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## లక్ష్య సాధన కోసం ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించాలి

- ప్రొ. ఇంద్రకంటి శేఖర్




**ముషీరాబాద్,విశాల భారతి:** తాము ఎంచుకున్న లక్ష్య సాధన కోసం విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించాలని అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని ఓయు ఎంబిఏ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. ఇంద్రకంటి శేఖర్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎంబిఏ, ఎంసిఏ సంవత్సరం విద్యార్థులకు విద్యారంభం పేరిట ఓరియంటేషన్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొ. ఇంద్రకంటి శేఖర్ మాట్లాడుతూ... విద్యార్థులు మంచి జ్ఞానాన్ని విద్యార్హతలను సాధించడంతోపాటు పోటీ ప్రపంచంలో తట్టుకోవడానికి తగిన విధంగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల తమ నైపుణ్యంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని ఉన్నతమైన కేరియర్ను నిర్మించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల చైర్మన్ ఎం. శ్రీనివాసరావు, డా.బి. సుజాత, ప్రొ. ఏ. సంతోష కుమారి, బ్రహ్మకుమారి, అంజలి సిస్టర్, అవంతి కార్యదర్శి ఎం. ప్రియాంక, అధ్యక్షులు ఎం. జ్ఞానేశ్వరి, ఎంవిఎస్ఎస్ నందీష్. హెచ్ఆర్. డైరెక్టర్ డా. వై. జయప్రద, ప్రిన్సిపాల్స్ ప్రొ. ఎస్. అప్పారావు, శేషకల్పసాయి,డా. స్వాతి,డా. ఎస్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తాత మధు క్షమాపణ చెప్పాలి: టీ పి సి సి కార్యదర్శి దాడిగ సందీప్ రాజ్

- చిలకలగూడలో నిరసన



**సికింద్రాబాద్, విశాల భారతి :** అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధు వెంటనే క్షమాపణ చెప్పాలని టిపిసిసి కార్యదర్శి దాడిగ సందీప్ రాజ్ డిమాండ్ చేశారు . చిలకలగూడ నిరసన కార్యక్రమం చేపట్టారు.సందీప్ రాజ్ ఎమ్మెల్సీ తాత మధుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత స్పీకర్పై తాత మధు చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని, మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా సందీప్ రాజు మాట్లాడుతూ...... తాత మధు చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి మహిళలు, దళిత సమాజాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాత మధు వ్యాఖ్యలపై తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు స్పందించి ఖండించాలని కోరారు. ఆయనను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తాత మధుకు ఓటు వేసిన చదువుకున్న విద్యార్థులు సైతం ఆయన వ్యాఖ్యలపై సిగ్గుపడుతున్నారని సందీప్ రాజ్ వ్యాఖ్యానించారు. చదువుకున్న వ్యక్తిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

- అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాష్ట్రంలోని విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సుమారు రూ.1,500 కోట్ల మేర ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని, వాటిని ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రభుత్వం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల సమస్యపై బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని తోకల శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్మెంట్ ఎంతో కీలకమని, నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, విద్యార్థుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును గౌరవించాలని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధుల విడుదల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో నిరసనకు దిగిన తోకల శ్రీనివాస్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి సికింద్రాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్కు తరలించారు. కార్యక్రమంలో జి. పాండు యాదవ్, అడికే జనార్ధన్, సంతు గౌడ్, మధుసూదన్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, తలారి చిన్న, అమర్ రెడ్డి, మాగాణి శివ, పవన్ సాయి, హర్ష వర్ధన్, లంకల సాయి తదితర బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## స్పీకర్పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలపై గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి ఆగ్రహం



**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి తీవ్రంగా ఖండించారు.రాజ్యాంగబద్ధమైన శాసన సభ స్పీకర్ పదవిని, సభా మర్యాదలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్ దళిత నాయకుడిగా ఎదగడాన్ని ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని చిలుక మధుసూదన్రెడ్డి ఆరోపించారు. అధికారం కోల్పోయిన అక్కసుతో రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. స్పీకర్ కుటుంబ సభ్యులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత అభ్యంతరకరమని, ఇలాంటి వ్యాఖ్యలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభ ప్రాంగణంలో సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం స్పీకర్కు సంబంధించిన అంశంగా చూడకుండా, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయంగా పరిగణించాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సభా మర్యాదలను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించిన సభ్యుడిపై తగిన చర్యలు తీసుకోవాలని చిలుక మధుసూదన్రెడ్డి కోరారు. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష నాయకులు ప్రజలకు, శాసనసభకు వివరణ ఇవ్వాలని, అవసరమైతే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ వ్యాఖ్యలపై స్పందించి క్షమాపణ చెప్పాలని, బాధ్యత వహించాలని ఆయన కోరారు.

## పీవీ మోహన్ను మర్యాదపూర్వకంగా కలిసిన జక్కిడి శివచరణ్రెడ్డి

- నూతన బాధ్యతలపై శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు



**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ వ్యవహారాల ఇన్చార్జ్గా నూతనంగా నియమితులైన కర్ణాటక రాష్ట్ర శాసనమండలి సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పీవీ. మోహన్ను తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవీ. మోహన్కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతలపై హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని జక్కిడి శివచరణ్రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 420 హామీలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ దౌర్జన్యాలు

- జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ఎమ్మెల్యేల దాడిపై భగ్గుమన్న బిఆర్ఎస్ శ్రేణులు
- నాగార్జున సాగర్ రహదారి దిగ్బంధం
- కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్
- రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం




**విశాలభారతి ,ఇబ్రహీంపట్నం:**

తెలంగాణ ప్రజలకు తామిచ్చిన 420 బూటకపు హామీలపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిలదీస్తారనే భయంతో వారిని అసెంబ్లీకి రానీయకుండా కాంగ్రెస్ పాలకులు పోలీసులతో దౌర్జన్యం చేయించారని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు తొలిరోజునే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను రానివ్వకుండా బయటే పోలీసులతో అడ్డుకుని , వారిపై దౌర్జన్యానికి దిగడానికి నిరసనగా బిఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యేలపై దాడి విషయం తెలిసిన వెంటనే యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగల్ పల్లి గేట్ వద్ద సాగర్ రహదారిపై పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గంటపాటు సాగర్ రహదారిని బిఆర్ఎస్ కార్యకర్తలు దిగ్బంధించడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హఠాత్తుగా రోడ్లపైకి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కార్యకర్తలను నెట్టివేసి ట్రాఫిక్ ను క్లియర్ చేయడానికి పోలీసులు ప్రయత్నించగా బిఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆగ్రహించిన బిఆర్ఎస్ కార్యకర్తలు సియం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి , ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అప్పుడే అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కార్యకర్తలను సముదాయించి ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో నెరవేరుస్తామని ఇచ్చిన హామీలను వెయ్యి రోజులైనా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హామీలపై , మోసాలపై బిఆర్ఎస్ పార్టీ గత వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టడంతో అధికార పార్టీకి వెన్నులో వణుకు మొదలైందని చెప్పారు. బిఆర్ఎస్ ఉద్యమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కాంగ్రెస్ పార్టీని ఎండగడుతున్నారని , దీంతో కాంగ్రెస్ దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని అన్నారు. అసెంబ్లీలో కేటీఆర్ , హరీశ్ రావు , సబితమ్మ బృందాన్ని ఎదుర్కోవడం తమవల్ల కాదని తెలిసే పోలీసులుతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దౌర్జన్యం చేయించి , అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. 22ఎ పేరుతో కాంగ్రెస్ భూ దోపిడీ , కాంగ్రెస్ 420 హామీలు , రెండు లక్షల ఉద్యోగాల భర్తీ , ఉపాధ్యాయ , ఉద్యోగుల , రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు , పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమం , ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల తదితర అంశాలపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ అరాచక పద్ధతులను ఎంచుకుందని ఆయన మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అగౌరవంగా వ్యవహరించిన సంఘటన యావత్ తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంత అణచివేయాలని ప్రయత్నించినా తెలంగాణ ప్రజలు అంతకు మించి తిరగబడతారనే వాస్తవాన్ని కాంగ్రెస్ పాలకులు గమనించాలని ఆయన సూచించారు. అణచివేతలు మానుకుని హామీల అమలు , ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆయన పాలకులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , రైతుబంధు మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ , చిలుకల బుగ్గరాములు , చీరాల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య , మాజీ ఎంపిపి కృపేష్, బూడిద రాంరెడ్డి , మహిళా నాయకురాలు నీలం శ్వేత , మాధవి , మున్సిపల్ అధ్యక్షులు కొప్పు జంగయ్య , గౌతంరెడ్డి , కళ్యాణ్ నాయక్ , కందాడి లక్ష్మారెడ్డి , ఏనుగు నరేందర్ రెడ్డి , సీనియర్ నాయకులు కోరె జంగయ్య , కాలె గణేష్, సుల్తాన్ , పొట్టి శ్రీకాంత్ , కొంద్రు ప్రవీణ్ , వనం శ్రీనివాస్ , సామ రవీందర్ రెడ్డి , మేడ్చల్ రాంరెడ్డి , మల్లేష్ యాదవ్ , వెంకటేష్ , శ్రీశైలం , యువత నాయకులు జెర్కోని రాజు , తిరుమల్ రెడ్డి , భద్రీనాథ్ , కాజ మహమ్మద్ , కలకొండ బాష , సోహాయిల్ , ఆనంద్ రెడ్డి , బాలకృష్ణ గౌడ్ , విద్యార్థి నాయకులు నిట్టు జగదీష్ , బొట్టు ప్రవీణ్ , నర్సగల్ల ప్రవీణ్ , ప్రసాద్ గౌడ్ , మధు , పవన్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం పోరాడితే అరెస్టులా?

**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :**



విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నించినందుకు అరెస్టులా? ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తే నిర్బంధాలా? అంటూ బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉండటంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆధ్వర్యంలో చేపట్టనున్న శాంతియుత నిరసనకు ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా అడ్డుకుంటూ ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. అనుమతులు నిరాకరించిన నేపథ్యంలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 'చలో అసెంబ్లీ-అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమీపంలో విద్యార్థుల తరఫున గళం వినిపించేందుకు వెళ్లిన హయత్నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యార్థుల కోసం ప్రశ్నిస్తే అరెస్టులా? ఫీజు బకాయిలు అడిగితే అరెస్టులా? ప్రజా సమస్యలపై గళమెత్తితే నిర్బంధాలా?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. అరెస్టులు, నిర్బంధాలతో బీజేపీ ఉద్యమాన్ని అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యం కాదని నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసనలకు అనుమతులు ఎందుకు నిరాకరించారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం ఆగదని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా సినిమా షూటింగ్.. ముగ్గురు మేనేజర్లపై కేసు

**రాజేంద్రనగర్, విశాల భారతి :**




నర్సింగి పోలీసుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు, ఎన్ఓసీ తీసుకోకుండా సినిమా షూటింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు మేనేజర్లపై నర్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. నర్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అలకాపురి-పుప్పలగూడ ప్రాంతంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో భాగంగా ట్రాఫిక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అలకాపురి-పుప్పలగూడ ప్రాంతంలో సినిమా షూటింగ్ జరుగుతున్నట్లు గుర్తించారు. వెంటనే షూటింగ్ నిర్వాహకులను విచారించి, పోలీసుల నుంచి అవసరమైన అనుమతులు, ఎన్ఓసీ ఉన్నాయా అని ఆరా తీశారు. అయితే నిర్వాహకుల వద్ద ఎలాంటి పోలీసు అనుమతులు లేవని గుర్తించారు. షూటింగ్ ప్రదేశంలో హీరోతో పాటు పలువురు సినీ కళాకారులు, సిబ్బంది కూడా ఉన్నారు. షూటింగ్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన మేనేజర్లు చింతల చెరువు శివ, ఎస్.ఏ. షబ్బీర్, చింత చంద్రశేఖర్పై ట్రాఫిక్ పోలీసు సిబ్బంది నర్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో అనుమతులు లేకుండా సినిమా షూటింగ్ నిర్వహించిన ఘటనపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, రహదారులపై ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడకుండా, ప్రజా భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సినిమా షూటింగ్లు నిర్వహించాలని పోలీసులు సూచించారు. షూటింగ్ నిర్వహించే ముందు సంబంధిత పోలీసు, ఇతర అధికారుల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు.

## పెద్దమడూరులో మొక్కలు నాటిన సర్పంచ్, ఉప సర్పంచ్

**దేవరుప్పుల విశాల భారతి :** మండలంలోని పెద్ద మడూరు గ్రామంలో సర్పంచ్ పానుగంటి గిరి, ఉప సర్పంచ్ చంద్రగిరి సంపత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని అన్నారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించి వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అవేర్ నర్సింగ్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపుగా జ్ఞాపికలు, బహుమతుల అందజేత




**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :** అవేర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ పూజ్య మాధవంజీ ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో, డైరెక్టర్ డా. ఇర్షాద్ అహ్మద్ నాయకత్వంలో, నర్సింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పార్వతి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు విద్యాబోధన అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బాటలు వేస్తూ, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల అంకితభావం, సేవలను గుర్తిస్తూ కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి జ్ఞాపికలు, బహుమతులను అందజేసి సత్కరించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది ఆషిఫ్, రవీన్, రాజ్కుమార్తో పాటు అధ్యాపకులు అస్మా బేగం, హసీనా రాణి నాగ్, కేరెన్ పెట్రిషియా, అరుణ, ఫ్లోరెన్స్, ప్రియాంక, అఖిల తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వనమా కాలనీలో 12 అడుగుల భారీ కొండచిలువ

- వీధి దీపాలు లేకపోవడంతో ఇళ్ల మధ్యకు వచ్చిన పాము.. భయాందోళనలో కాలనీవాసులు
- వీధి దీపాలు ఏర్పాటుచేసి చెట్లు పొదలు తొలగించాలని కాలనీవాసుల డిమాండ్



**పాల్వంచ:విశాలభారతి సెప్టెంబర్ 7:** పాల్వంచ పట్టణంలోని 7వ డివిజన్ వనమా కాలనీలో సోమవారం రాత్రి సుమారు 12 అడుగుల భారీ కొండచిలువ ప్రత్యక్షం కావడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ వర్షం కురుస్తుండటంతో పాటు కాలనీలో వీధి దీపాలు సరిగా లేకపోవడంతో పాము ఇళ్ల మధ్యకు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు.చీకటిలో భారీ పాము సంచరించడాన్ని గమనించిన స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా జంకారు. కాలనీలో వీధి దీపాల కొరత కారణంగా రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. భారీ పాము ఇళ్ల మధ్యకు రావడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు,కాలనిలో పలు ప్రాంతాలలో చెట్లు పోదలు ఉండడంతోనే పాములు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు మరియు స్థానిక కార్పొరేటర్ స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలుప్రజలు కోరుతున్నారు

## కేఎల్ఆర్ ప్రతినిధులకు 'శిక్షా రత్న2026'




**పాల్వంచ, విశాల భారతి:** సెప్టెంబర్ 7: కేఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్పర్సన్ కె. నాగమణి, కేఎల్ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావులకు ప్రతిష్ఠాత్మక 'శిక్షా రత్న2026' పురస్కారాలు లభించాయి. విద్యారంగంలో సేవలు, విద్యాసంస్థల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో చేసిన కృషికి గుర్తింపుగా నాగమణికి, అకడమిక్ ఎక్సలెన్స్ విభాగంలో నరసింహారావుకు ఈ అవార్డులు అందజేశారు. హరి విశ్వవిద్యాలయం, సూపర్ ఏఐ అకాడమీ, అదాబ్ హైదరాబాద్, సాక్షి ఎడ్యుకేషన్, స్టడీ9 మీడియా సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డా. వి. బాలకృష్ణ రెడ్డి, ఐసీఏఆర్ఏఐసీఆర్పీ డైరెక్టర్ డా. తారా సత్యవతి సమక్షంలో పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

## కూకట్పల్లిలో బ్లింకిట్ డెలివరీ బాయ్స్పై దాడి

- మెరీనా స్కైస్, రెయిన్బో విస్టాస్ గేటెడ్ కమ్యూనిటీలలో చోటుచేసుకున్న ఘటన.
- నిలదీసిన తోటి ఉద్యోగులు, ఆందోళన

**కూకట్ పల్లి, విశాల భారతి:** కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీలలో బ్లింకిట్ డెలివరీ బాయ్స్పై స్థానికులు దాడికి పాల్పడటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డెలివరీ నిమిత్తం వెళ్లిన సిబ్బందిని అకారణంగా కొట్టడంతో పాటు నిర్బంధించారంటూ తోటి డెలివరీ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. మెరీనా స్కైస్ గేటెడ్ కమ్యూనిటీకి బ్లింకిట్ డెలివరీ కోసం వెళ్లిన రామ అనే డెలివరీ బాయ్ సర్వీస్ లిఫ్ట్ వాడుతున్నాడనే కారణంతో అక్కడి సిబ్బంది, స్థానికులు ఒక్కసారిగా దాడికి దిగారు. అంతటితో ఆగకుండా అతడిని దాదాపు గంటపాటు నిర్బంధించారు. సరిగ్గా అదే సమయంలో పక్కనే ఉన్న రెయిన్బో విస్టాస్ గేటెడ్ కమ్యూనిటీలో షాదాబ్ అనే మరో డెలివరీ బాయ్ ఆర్డర్ ఇవ్వడానికి వెళ్లగా, అతడిపై కూడా కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న తోటి బ్లింకిట్ డెలివరీ ఉద్యోగులు పెద్దయెత్తున రెయిన్బో విస్టాస్ గేటెడ్ కమ్యూనిటీ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. తాము ఎలాంటి తప్పు చేయకపోయినా కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, డెలివరీ బాయ్స్పై భౌతిక దాడి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.



# రకుల్ ప్రీత్ సింగ్ రీఎంట్రీకి రెడీనా

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్‌కు ఎప్పుడు బ్రేక్ వస్తుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్లుగా వెలిగిన వారు.. ఆ తర్వాత ఒక్కసారిగా సినిమాలకు దూరమై ప్రేక్షకులకు కనిపించకుండా పోతుంటారు. ప్రస్తుతం యంగ్ హీరోయిన్ల హవా కొనసాగుతుండటంతో పలువురు సీనియర్ హీరోయిన్లకు అవకాశాలు తగ్గుతున్నాయి. కొందరు పెళ్లి చేసుకుని కుటుంబ జీవితంలో స్థిరపడుతుండగా.. మరికొందరు బిజినెస్, ఇతర రంగాలపై ఫోకస్ పెడుతున్నారు. ఇదే సమయంలో ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది. సినిమాలకు కొంతకాలంగా దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. దాదాపు ఏడాదిన్నర తర్వాత మళ్లీ స్ట్రెంత్ ట్రైనింగ్ వర్కౌట్స్ ప్రారంభించారు. జిమ్‌లో కష్టపడుతున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో.. రకుల్ మళ్లీ సినిమాల్లోకి రాబోతున్నారా? అనే చర్చ మొదలైంది.రకుల్ ప్రీత్ సింగ్‌కు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో హీరోయిన్‌గా సినీ ప్రయాణం ప్రారంభించారు. ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'కెరటం' సినిమాతో పరిచయమైన రకుల్.. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' తో మంచి విజయాన్ని అందుకుని ఒక్కసారిగా టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారారు. అనంతరం పలువురు స్టార్ హీరోల సరసన నటించి వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. దక్షిణాసియా నెట్‌వర్క్‌లో చేరండి తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకున్న రకుల్.. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్.. ప్రస్తుతం హిందీ చిత్రాలపై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత జీవితంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.తాను ప్రేమించిన బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని రకుల్ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.అయితే కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంతో అభిమానులు రకుల్ కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే గతంలో తీవ్రమైన నడుము నొప్పి కారణంగా ఆమె కొంతకాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. దీంతో వర్కౌట్స్‌కు కూడా దూరంగా ఉన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.